# ప్రయాణం

అమ్మ వంటింటి గడపదగ్గర కూర్చుని మాటిమాటికీ కొంగుతో కళ్ళొత్తుకుంటోంది. నాన్నగారు మేడమీద కూర్చుని మండి పడుతున్నారు. తమ్ముడు కాలుకాలిన పిల్లిలా సావిట్లోనూ వరండాలోనూ తిరుగుతున్నాడు. నేను సిద్ధంగానే ఉన్నాను. సిద్ధమవడానికి మాత్రం ఏముంది! తెచ్చుకున్న నాలుగు బట్టలూ చిన్న సూట్‌కేసులో పెట్టుకున్నాను. పుస్తకాలు రెండూ చేతిసంచీలో పెట్టాను. రైలుకి వేళ ఖపోయింది. ఒక్కళ్ళూ మాట్లాడరు.

ఇక లాభం లేదనుకుని నేనే తమ్ముణ్ణి పిలిచి టాక్సీని పిలుచుకు రమ్మన్నాను. అమ్మ ఉలిక్కిపడి, వాణ్ణి వెనక్కి పిలిచేలోగానే వాడు గుమ్మం దాటేశాడు. అమ్మ మేడమీదికి వెళ్ళింది నాన్నగారిని పిలుచుకు రావడానికి. అనవసరంగా ఆయన మెట్లు దిగిరావడ మెందుకని నేనే మేడ మీదికి వెళ్ళాను.

'వెడితే వెళ్ళమను, నాతో చెప్పడందేనికి? పెద్దవాళ్ళు చెబితే వినడం-అనే జ్ఞానం లేనప్పుడు' అని కసురుతున్నారు నాన్నగారు. అమ్మ బిక్కుబిక్కుమంటూ గదిలోంచి ఇవతల కొస్తూంటే నేను లోపలికివెళ్లాను.

నన్ను చూడగానే నాన్నగారు మొహం గోడవైపుకి తిప్పుకున్నారు. ఏం మాట్లాడాలో తోచలేదు. 'జరిగిందానికి నన్ను క్షమించండి' అని అడగటం అసందర్భంగా తోచింది. ఆయన క్షమించరు. అలాగని నా అభిప్రాయాన్ని మార్చుకోవడానికి నేను సిద్ధంగాలేను. ఆయన మీద నాకు ప్రేమ, గౌరవం లేవని కాదు. నామీద కూడా నాకు ప్రేమ, గౌరవం ఉన్నాయి. నేను చెయ్యదలుచుకున్న పని తప్పు కాదని నేను నమ్మినప్పుడు, అది నా జీవితానికి సంబంధించిన ముఖ్యాంశమయినపుడు— అమ్మ మనసు కష్టపెట్టుకుంటుందనీ, నాన్నగారు కోపగిస్తారనీ తల వొగ్గడం నాకు చాతకాదు. 'నాన్నగారూ, ఈ ఒక్క విషయంలో నన్ను అభ్యంతర పెట్టకండి. నాసుఖాన్ని కోరేవారైతే అతన్ని చేసుకోమని నన్ను బలవంత పెట్టకండి' అని ప్రాధేయపడితే నాన్నగారు మెత్తపడతారేమో! ఏమో! 'అమ్మా, ఈఒక్కవిషయంలోనూ నామాట కాదనకు, నా పరువు దక్కించు తల్లీ. కావాలని కాళ్ళముందుకొచ్చిన సంబంధం. తీరా మాటిచ్చేశాను. నామాట నిలబెట్టుతల్లీ' అని నాన్నగారు బతిమాలితే నేను మెత్తపడతానా? చెప్పినట్లు వింటేనే ఆయనమీద ప్రేమ, గౌరవం ఉన్నట్లూ, లేకపోతే లేనట్లూనా!

'నాన్నగారూ' అన్నాను, ఏదో అందామని. ఏమనాలో ఆలోచించుకోలేదు. క్రిందనుంచి టాక్సీ హార్న్ వినిపించింది. 'ఊఁ, వెళ్ళు' అన్నారు ముక్తసరిగా. కిందికొచ్చేశాను. బత్తాయిపళ్ళూ అవీ నా చేతి సంచీలో కుక్కుతోంది అమ్మ. 'ఎందుకమ్మా అవన్నీను' అని అలవాటు చొప్పున నోటి చివరిదాకా వచ్చింది అనలేదు. అసలే అమ్మమనస్సు బాగా లేదు. మాట్లాడక సంచీ తీసుకుని గుమ్మం దాటుతున్నాను. 'పరీక్షలికి బాగా చదువు. ఆరోగ్యం జాగ్రత్త' అన్నారు నాన్నగారు—అప్పుడే మేడమీంచి క్రిందికొచ్చినట్లున్నారు. వీధిమెట్లు దిగుతూంటే, అమ్మ 'ఉండు

ఓసారి వెనక్కిరా' అంది. ఏమిటన్నట్లు చూశాను. ఎదురుగా అచారిగారు ఒక్కరూ వస్తున్నారు. 'ఏమిటే, చాదస్తం మరీను" అనేసి టాక్సీ ఎక్కేశాను. సూట్‌కేసు లోపల పెట్టాడు తమ్ముడు.

"జాగ్రత్తగా రైలెక్కించిరా" అని తమ్ముణ్ణి హెచ్చరించారు నాన్నగారు. వాణ్ణి చూసి నవ్వుకున్నాను. టాక్సీ పోతోంది.

"అక్కా నిన్నొకటి అడగనా?"

"ఈ సంబంధం ఎందుకొద్దన్నావే?" నసుగుతూ అడిగాడు. మాట్లాడకుండా అద్దంలోంచి బయటకు చూశాను. అద్దం మట్టిపట్టి మచ్చలు పడి ఉంది. మసక మసగ్గా కనిపిస్తోంది, అద్దాన్ని క్రిందికి దించేశాను. ఈ సారి గాలికూడా వెచ్చగా తగిలింది. మూర్తి ఊపిరి గుర్తుకొచ్చింది.

"శేఖరంగారు మా బావగారు అవుతున్నారని నా ఫ్రెండ్స్ అందరితో చెప్పేశానక్కా".

తమ్ముడి చిన్నతనానికి జాలేసింది. ఏమని సముదాయించనువాణ్ణి? 'నీ కింకోమంచి బావగార్నితెచ్చిపెడతాలేరా' అందామనిపించింది. తనక్కాబోయే అల్లుడని శేఖరం గురించి నాన్నగారు అందరితో అన్నారుట. ఆయనా తొందరపడ్డారు.

శేఖరం స్టేషనుకి వస్తాడని అనుకోలేదు. టాక్సీ ఆగగానే వచ్చి తలుపు తెరిచాడు. నాన్నగారు ప్రయోగించదలచిన ఆఖరి అస్త్రమా ఇతని రాక——అన్న సందేహం కలిగింది. క్షణం పాటు నానరాలు బిగుసుకున్నాయి.

'ఇంత ఆలస్యం అయిందేమిటి? రైలు ప్లాట్‌ఫామ్ మీదికి వచ్చేసింది' అంటూ తమ్ముడి చేతిలోని సూట్‌కేసు తీసుకున్నాడు. తమ్ముడు

ప్లాట్‌ఫామ్ టిక్కెట్ తీసుకోవడానికి వెళ్లబోతూంటే వాణ్ణి వారించాడు. తనే తీసుకుని ఉంచాడుట.

'మీరు వస్తారనుకోలేదు' అన్నాను.

'ఒక్క ముక్క చెబుదామని వచ్చాను.' ఆఖరి సారిపీల్చి సిగరెట్‌ని బూటుతో నలిపాడు. ఏం చెప్పినాసరే, నా నిర్ణయాన్ని మాత్రం మార్చుకోలేనని స్పష్టంగా చెప్పాలని నిశ్చయించుకున్నాను. రైలు కూత పెట్టింది. నడక వేగం హెచ్చించాము. ఫస్టు క్లాసు కంపార్ట్‌మెంటు ప్లాట్‌ఫామ్ చివరగా ఉంది. జనాన్ని తప్పించుకుంటూ హడావిడిగా నడవడంతో కొంచెం ఆయాసం వచ్చింది. కంపార్ట్‌మెంటులో కూర్చున్నాను కిటికీ దగ్గరగా. కిటికీ ఊచలు పట్టుకుని తమ్ముడు అవతల నుంచున్నాడు. శేఖరం కనిపెంచలేదు. ఇటూ అటూ చూశాను. నాలుగైదు పత్రికలు కొని పట్టుకొస్తున్నాడు. 'నా మీద ఇంకా ఎందుకంత శ్రద్ధ' అనుకున్నాను. పెట్టెలోపల పెట్టి పత్రికలు ఇస్తే పుచ్చుకున్నాను.

జేబులోంచి సిగరెట్ పెట్టెతీసి ఓ సిగరెట్ నోట్లోపెట్టుకున్నాడు. వెలిగించబోతూంటే రైలు కూత పెట్టింది—చెవులు చిల్లులు పడేట్లు. అగ్గిపుల్ల ఆరిపోయింది. మరోటి వెలిగించాడు. ఆరిపోకుండా. అరచెయ్యి అడ్డు పెట్టుకుని సిగరెట్ ముట్టించుకున్నాడు. రైలు కదిలింది కొద్దిగా.

"ఏదో చెప్పాలనుకున్నట్టున్నారు" అన్నాను. కుతూహలాన్ని ఆపుకోలేక పోయినందుకు నాకే సిగ్గేసింది. అరచేతి చాటున అగ్గిపుల్ల అలాగే పట్టుకొని నా వైపు కళ్ళెత్తి చూశాడు. చెయ్యి చురుక్కుమన్నట్టుంది. పెదిమల చివర నుంచి సిగరెట్ జారిపడింది. ఆతను ఏమీ అనలేదు. రైలు ముందుకు సాగింది. అతనివైపే చూస్తున్నాను. ఏం చెప్పాలనుకున్నాడు? తనని మోసం చేశాననా? సిరిరామోకాలొడ్డుతున్నాననా? పెద్దవాళ్ళమాట

వినకుండా పొగరు మోత్తనం చూపిస్తున్నాననా? నాకన్న అందమైన దాన్నీ తెలివైన దాన్నీ సంపాదించుకోగలడనీనా? నేను... ఒక్క పరుగున ముందుకొచ్చి చెయ్యిచాచాడు శేఖరం. చెయ్యి కలిపాను. చిరునవ్వుతో ఆప్యాయంగా అదిమి వదిలేశాడు. రైలు పరుగు ప్రారంభించింది.

అంతవరకూ కంపార్టుమెంటులో ఎవరున్నారన్న సంగతి కూడా గమనించలేదు. చూస్తే ఒక్క సాధువు తప్ప మరెవ్వరూ లేరు. ఏదో వేదాంత గ్రంథంలా ఉంది చదువుతున్నాడు. సాంగత్యం మంచిదే. నవ్వుకున్నాను మనసులోనే. అయినా, ఛాయమాత్రంగా నయినా నా మొహం మీద చిరునవ్వు కనిపించిందో ఏమో, అప్పుడే పుస్తకం లోంచి తల ఎత్తి ఆయన నావైపు చూసి చిరునవ్వు నవ్వాడు. బెంగాలీ వాడిలా ఉన్నాడు. "ఎంతవరకూ వెడుతున్నావు" అని ఇంగ్లీషులో అడిగాడు. అదమరపుగా ఆయన్నే పరిశీలిస్తున్న నేను కొంచెం ఉలిక్కిపడి "వాల్తేరుదాకా అనుకుంటాను" అన్నాను ఇంగ్లీషులోనే. నా సమాధానం నాకే తెలివితక్కువగా తోచింది— "అనుకోవడం" ఏమిటి!

ఆయన మృదువుగా నవ్వుతూ "నిన్ను చూడగానే అనుకున్నాను నువ్వు వేదాంతి వవుతావని" అన్నాడు.

పకపకా నవ్వాను. "ఇంకానయం" అనుకున్నాను. నా నవ్వుకి ఆయన చిన్నబుచ్చుకున్నాడేమో నన్న అనుమానం వేసి మళ్ళీ ఆయన ముఖంలోకి చూశాను. ఎంతో సౌమ్యంగా నా వైపొక్కసారి చూసి వెంటనే పుస్తకం వైపు దృష్టిపోనిచ్చాడు. ఆయన మీద గౌరవభావం కలిగింది నాకు. ఆయనకి ఇబ్బంది కలిగించకూడదనుకుని నేనూ సంచీ లోంచి 'లెవియాథన్' తీసి చదవడం మొదలుపెట్టాను. పది పదిహేను పేజీలు

చదివేసరికి రైలు కుదుపుకి తలనెప్పెట్టింది. కాస్సేపు కిటికీలోంచి—వెనక్కి పరుగెడుతూన్న చెట్లనూ పొలాలనూ చూశాను. పరుగెట్టుకొచ్చి చెయ్యి చాచిన శేఖరం గుర్తుకొచ్చాడు. అతనుకొనిచ్చిన పత్రికలూ గుర్తుకొచ్చాయి. 'టైమ్' తీసి తిరగేశాను కొంతసేపు. తెలుగుపత్రికల్లోని రెండు కథలు చదివాను. విసుక్కుని అవతల పడేశాను మళ్ళీ 'హాబ్స్' తీశాను. దీపాలు వెలిగాయి. చుట్టూ చెట్లూ చేమలూ ముదురు రంగులో కనిపిస్తున్నాయి. దూరంగా కొండలు గచ్చకాయ రంగులోనూ పాకుడు రంగులోనూ కనిపిస్తున్నాయి. పుస్తకంలో పంక్తులు అలుక్కుపోయినట్లు కనిపిస్తున్నాయి. పమిట కొంగుతో తుడుచుకున్నాను. అక్షరాలు ఏమంత కొట్టొచ్చినట్లు కనిపించలేదు. అంతకంతకు అపరిచితంగా తోస్తున్నాయి.

స్వాముల వారి వంక చూశాను. ఆయన ఇందాకటిలాగే నిశ్చలంగా కూర్చుని దీక్షగా పుస్తకం చదువుకుంటున్నాడు. ఏమిటో చదువు-కాస్త కబుర్లు చెప్పడానికి వీల్లేకుండా, రైల్లో యమదీక్షగా చదివేవాళ్లను చూస్తే ఒళ్ళుమంట. నాకు పరీక్షలు కాబట్టి తప్పలేదుగాని! హఠాత్తుగా ఏమన్నా తినాలపించింది. స్టేషను ఎక్కడా దరిదాపుల్లో ఉన్న సూచనలు లేవు. రైలు శరవేగంతో పోతోంది. అమ్మ ఇచ్చిన బత్తాయిపళ్లు గుర్తుకొచ్చాయి. ఒకటితీసి ఒలవబోయాను. మళ్ళీ ఆలోచించి, ఇంకో పండు తీసి స్వాముల వారికేసి తిరిగి 'తీసుకుంటారా' అన్నాను. ఆయన చిరునవ్వుతో స్వీకరించాడు. కానీ పక్కన పెట్టేసి మళ్ళీ చదువు కొనసాగించాడు. నాకు ఒళ్ళు మండింది. ఏమైనాసరే, ఆయన్ని పలకరించి మాటల్లోకి దింపాలనుకున్నాను. నా పండు ఒలుచుకుంటూ ఆయన వైపే పరీక్షగా చూస్తున్నాను. అలా చూస్తూంటే ఎన్నో ప్రశ్నలు పుట్టుకొచ్చాయి—ఈయన వయస్సు ఎంతుంటుంది? అసలు ఏ ఊరు? పేరే

మిటి? సాధువెందుకయ్యాడు? ఎప్పుడయాడు? ఇప్పుడెక్కడ ఉంటు న్నాడు-లాంటి ప్రశ్నలు. నాకు నేనే సమాధానాలు చెప్పుకున్నాను—ఓ యాభై ఏళ్లుండొచ్చు. కాశీయో గయో అయి ఉంటుంది ఈయన ఊరు. ఎలాంటి పేరు ఉంటే బావుంటుందో ఊహించడం మొదలు పెట్టాను. ఒక్కటీ సంతృప్తికరంగా కుదరలేదు. సన్యాసం ఎందుకు పుచ్చుకుని ఉంటాడు? పెళ్లాం బిడ్డల్ని పోషించలేకనా, అప్పుల బాధ పడలేకనా, ఉద్యోగం దొరక్కనా—ఎందుకని సాధువుల్లో చేరిపోయాడు చెప్మా?

"ఏమమ్మా, తోచడం లేదనుకుంటాను." ఉన్నట్టుండి మాటలు వినిపించాయి. ఆయన తెలుగువాడే—ఏ ప్రాంతంవాడోగాని. ఏమీ తోచక ఆయన వైపే దీక్షగా చూస్తున్న సమయాన పట్టుబడి పోయినందుకు సిగ్గు పడ్డాను. అయినా, తెచ్చిపెట్టుకున్న దర్పంతో "ఎలా అనుకున్నారు తోచడంలేదని" అని అడిగాను

"ఇందాకటి నుంచీ ఒక్క పనిలోనూ నిమగ్నం కాలేక పోతున్నావు కదా"

"అయితే ఇందాకటి నుంచీ మీరు దీక్షగా పఠిస్తున్నారనుకోవడం నా భ్రమ అన్నమాట" అన్నాను కవ్విస్తూ.

"ఇదిగో, పుస్తకం తీసుకుని నన్ను పరీక్షించవమ్మా" అన్నా డాయన చిలిపిగా నవ్వుతూ. నాకన్న రెండాకులు ఎక్కువే చదివాడను కున్నాను. పుస్తకం తీసుకు చూశాను. "రామకృష్ణ పరమహంస" మొదటి పేజీ తిప్పి చూశాను, "రామకృష్ణ మఠం గ్రంథాలయం—కలకత్తా" అని ముద్ర ఉంది.

పుస్తకం ఆయనకి తిరిగి ఇచ్చేస్తూ అడిగాను—"మీరెంతకాలం నుంచీ ఉన్నారిందులో?"

"పాతిక సంవత్సరాలకు పైగా అవుతుంది."

"మీకు జీవితం మీద విరక్తి ఎందుచేత కలిగిందో తెలుసుకో వచ్చునా?" "నా కుతూహలానికి క్షమించండి" అన్నాను వెంటనే.

"సంశయాన్ని తీర్చుకోవడంలో తప్పులేదమ్మా. సూటిగా అడిగి తెలుసుకోకుండా పరిపరి విధాల ఆలోచించి మనస్సుకి శ్రమ కలిగించడం శ్రేయస్కరం కాదు. నువ్వు ఊహించినట్లుగా నాకు జీవితం మీద 'విరక్తి' కలగడం వల్ల కాదు—ఐహిక జీవితం మీద 'రక్తి' కలక్కపోవడం వల్లనే ఈ మార్గాన్ని అనుసరించాను'.

ఆయన యుక్తికి నవ్వుకున్నాను. 'మీకు 'రక్తి' ఎందుక్కలగ లేదు' అని అడుగుదామనుకుని మళ్ళీ మనసుమార్చుకున్నాను—బావుండ దేమోనని.

'మీరు ప్రస్తుతం ఎక్కడికి వెడుతున్నారు?' అని ధోరణిమార్చాను.

'స్వామి వివేకానందుని శతజయంతి ఉత్సవ సందర్భంలో మన దేశంలోని ముఖ్య కేంద్రాలు పర్యటించి రామకృష్ణపరమహంస తత్త్వం పైన కొన్ని ప్రసంగాలు చేయడానికి నియమితుణ్ణయాను. దారిలో విశాఖ పట్టణంలో దిగి, ఆ తరవాత కలకత్తా వెళ్లవలసి ఉంది.

'విశాఖ పట్నంలో ఎన్నాళ్లుంటారు'? ఉత్సాహంగా అడిగాను. 'ఒక్కరోజు' అని చెప్పాడు. 'తప్పకుండా వచ్చి మీ ప్రసంగాన్ని వింటాను' అన్నాను. ఆయన సంతోషించాడు.

ఆయనతో సంభాషణ కొనసాగడానికి సావకాశం లేకుండా కాజీపేట వచ్చింది. ఎవరో ఇద్దరు దంపతులు ఎక్కారు కంపార్ట్‌మెంటులోకి, పెద్ద

పెద్ద భోషాణాల్లాంటి ట్రంకుపెట్టెలూ, రోడ్డు రోలర్లంత బెడ్డింగులూ, పళ్ల బుట్టలూ, ఎర్రగా నూనె కారుతున్న ఊరగాయల డబ్బాలూ, పూల కుండీలు—క్షణంలో వాళ్ల సామానుతో కంపార్ట్‌మెంటు నిండి పోయింది. నడవడానిక్కూడా జాగా లేనంతగా కిక్కిరిసిపోయింది రకరకాల శాల్తీలతో క్లోక్ రూమ్‌కి వెళ్లడానికి ఆసామాను మీంచి గెంతులువేసి దాటవలసి వచ్చింది. పెట్టెలు జరపడంతో స్వాముల వారి పాదం మీదికి తోసేసి నట్టున్నారు—స్వాముల వారి ముఖంలో అరక్షణం సేపు బాధ కన్పట్టి, అంతలోనే ప్రశాంతత ఆవరించింది. ఆయన సహనానికి మనసులోనే జోహారులర్పించాను.

ఆ పూటకి స్వాముల వారు భోజనం చెయ్యనన్నారు. నేనిందాక ఇచ్చిన బత్తాయిపండు ఒలుచుకు తిని గ్లాసుడు మంచినీళ్ళు తాగారు. నేను రైలు దిగివెళ్ళి రెండు పూరీలు, కూర పొట్లం కట్టించి తెచ్చుకున్నాను. లస్సీ అమ్మొస్తే ఒక గ్లాసుడు తీసుకున్నాను. రాత్రి పది కావచ్చిందేమో, తిన్న వెంటనే నిద్ర పట్టేసింది.

మర్నాడు పొద్దున్న ఏలూరు వచ్చాక మెలుకువొచ్చింది. తెల్లవారి వెలుగులో పరీక్షగా చూశాను రాత్రి కాజీపేటలో ఎక్కినావిణ్ణి. పాతికేళ్లు ఉంటాయేమో, పెద్ద అందంగా లేకపోయినా ఆకర్షణీయంగా ఉంది. ఎక్కడో చూసినట్లుగా ఉంది ముఖం. ఎక్కడ చూశాను చెప్మా అని ఎంతో ప్రయత్నించాను గుర్తుకి తెచ్చుకోవడానికి. ఆవిడభర్తని మాత్రం ఎప్పుడూ చూసినట్లు లేదు. ఆవిణ్ణే ఎక్కడో చూసినట్లు అనుమానం. సంభాషణలోకి దింపితే ఏ సంగతీ తేలుతుందని నేనే మొదలుపెట్టాను.

'ఎక్కడిదాకా వెడుతున్నారండీ?'

'నిడదవోల్లో దిగి నరసాపురం వెళ్లాలి. అనేసరికి నా ఉత్సాహం సహం చప్పబడిపోయింది. నేనెప్పుడూ నరసాపురం ఎరుగను. ఈ విణ్ణి

మరెక్కడ కలిసి ఉంటాను? హైదరాబాదు అయినా అయి ఉండాలి. వాల్తేరు అయినా అయి ఉండాలి. మరో ఊరుతో నాకు అట్టే పరిచయం లేదాయెను.

ఈసారి నన్ను అడిగిందావిడ 'ఎక్కడిదాకా ప్రయాణం' అని. చెప్పాను.

'చదువుకుంటున్నారా అక్కడ!'

'అవునండీ.'

'ఎక్కడ? ఎ.వి.ఎన్,లోనా?'

'కాదండి. యూనివర్సిటీలోనే'.

'మీకు మూర్తి- వై.ఎన్, మూర్తి తెలుసునా?'

ఈమాటు నా ఉత్సాహం ఆపుకుందామన్నా ఆగలేదు, మూర్తి ఈవిడకి తెలుసునన్న మాట. మూర్తికి చుట్టం కాదు కదా!' 'మీకెలా తెలుసును ఆయన?' అన్నాను, మూర్తి నా ఒక్కదాని సొత్తే అయినట్లు.

'వాడు మా అన్నయ్యే' అంది గర్వంగా.

అప్పుడు నాకు జ్ఞానోదయం అయింది. అందుకే- ఆ పోలిక కొంచెం ఉండబట్టే ఈవిణ్ణి ఎక్కడో చూసినట్లనిపించింది. నా సబ్జక్టు ఏమిటని అడిగిందావిడ. చెప్పాను!

'అయితే మా అన్నయ్య నీకు బాగా తెలుసునన్న మాట' అంది ఉత్సాహంగా నాకు మరింత దగ్గరగా జరుగుతూ. ఇంతలో ఆవిడ భర్త మా ఇద్దరికీ ఇడ్లీలు పట్టుకొచ్చి ఇచ్చాడు?

'అవును గాని, మా అన్నయ్యకి ఎవరో స్నేహితురాలు ఉందిట. నీకు తెలుసునా?' అంది కబుర్ల ధోరణిలో. నా పెదిమలు ఒణికాయి

సిగ్గుతో. ఏమని చెప్పాలో తెలియలేదు, ఎలా అయినా తప్పించుకుందామని, ఏమీ ఎరగనట్లు 'ఆయనకి చాలామంది స్నేహితులున్నారు. చాలా సరదా అయిన మనిషి' అన్నాను. నేను అమాయకురాలినని నమ్మిందావిడ.

'అది కాదు. వాడు ఎవరో అమ్మాయిని ప్రేమించాడుట. మా నాన్న ఎన్ని సంబంధాలు చూసినా ఏదో వంకపెట్టి ఒప్పుకోవడం లేదు. ఏ కులం పిల్లని ప్రేమించాడోనని మా అమ్మ భయం.'

'మీకా భయం ఏమీ అవసరం లేదు. ఆయన ప్రేమించినది నన్నే అని చెప్పెయ్యాలన్నంత ఉద్రేకం కలిగింది. ఎలాగో అణుచుకుని 'మీ అమ్మగారూ వాళ్ళు ఎక్కడుంటున్నారు?' అని మాట తప్పించేశాను. ఆవిడ భోళాభోళీ మనిషిలా కనిపించింది. ఏమైనా విషయం అందిస్తే చాలు, అదే పనిగా ఆ విషయమై, నిస్సంకోచంగా మాట్లాడేస్తుంది. ఏమైనా, మనిషి మంచిది. ఆవిడ నా ఆడబడుచు కాబోవడం నా అదృష్టమే- కలిసి మెలిసి సరదాగా ఉండగలుగుతాను- అనుకున్నాను.

మూర్తి చెల్లెలూ, ఆవిడ భర్తా నిడదవోల్లో దిగిపోయారు. మళ్ళీ స్వాములవారూ నేనూ మిగిలాం. ఇద్దరం చెరో పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాం.

రాజమండ్రీ స్టేషనులో రైలు ఆగింది. కూర్చుని నడుము నెప్పెట్టి ఉందేమో, కాస్త అటూఇటూ పచార్లు చేద్దామనిపించింది.

'స్వామీజీ! ఇప్పుడే అలా తిరిగివస్తానండీ' అని లేచాను.

'త్వరగా రామ్మా, పత్రికలూ అవీ చూస్తూ ప్రయాణం మాట మరిచిపోయేవు' అన్నారు చిరునవ్వుతో.

బుక్‌స్టాల్ ప్లాట్‌ఫామ్ చివర ఏక్కడో ఉంది. అక్కడిదాకా వెళ్లా లనిపించలేదు. దిగి ఊరికే ఇటూ అటూ చూస్తున్నాను. 'కన్నెపిల్లలికి కొన్ని చిట్కాలు కావాలామ్మా' అని పక్కనుంచి చిన్నగొంతుతో ఎవరో అడిగారు. అటు తిరిగి చూశాను. రెండు చేతుల నిండా పుస్తకాలు పెట్టు కొని అమ్మకానికి వచ్చిన మనిషి. వద్దు అన్నాను. అయినా వినిపించుకో కుండా 'దాంపత్య సుఖం' 'మొదటి రాత్రి' 'అరవై...' 'వద్దయ్యా' అన్నాను గట్టిగా. ఏమనుకున్నాడో! నన్ను ఎగాదిగా ఒక్కసారి చూసి పక్క కంపార్టుమెంటు వైపుకి వెళ్లిపోయాడు. 'అయ్- కెనకంబరాలూ- సంపెంగి పువ్వులూ' అంటూ అరుచుకుంటూ నా పక్కనుంచే పోయాడు పువ్వులమ్మేవాడు! వాడి కేకకి చెవులు గింగురుమన్నాయి. కొంచెం దూరంలో ద్రాక్షపళ్ళవాడు కనిపించాడు. కాసిని కొని స్వాముల వారి కిద్దామని వాడివైపుకి నడిచాను. వెనక నుంచి ఎవరో నన్ను పేరు పెట్టి పిలిచినట్లనిపించింది. ఆడగొంతు. అనుమానంతో వెనక్కి తిరిగి చూశాను. సుధ! ఒక్క అంగలో వచ్చి నా చేతులు రెండూ పట్టుకుంది.

'నువ్వేలా వచ్చా విక్కడికి?' అన్నాను.

'నువ్వేలా వచ్చావో చెబుదూ' అంది చింకి చాటంత మొహం చేసుకుని.

'వాల్తేరు వెడుతున్నాను-హైదరాబాదు నుంచి'.

'మేమిక్కడే ఉంటున్నాం. ఇప్పుడు. ఈ మధ్యనే ఇక్కడికి బదిలీ అయింది, ఒక్కపూట మా ఇంట్లో ఉండి వెళ్లు రమా.'

'అబ్బే, పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈసారి సెలపుల్లో వస్తాలే రా, నా కంపార్టుమెంటుకి పోదాం, కాస్సేపు కూర్చుని మాట్లాడుకోవచ్చు' అన్నాను.

బుక్‌స్టాల్ ప్లాట్‌ఫామ్ చివర ఎక్కడో ఉంది. అక్కడిదాకా వెళ్లాలనిపించలేదు. దిగి ఊరికే ఇటూ అటూ చూస్తున్నాను. 'కన్నెపిల్లలికి కొన్ని చిట్కాలు కావాలామ్మా'' అని పక్కనుంచి చిన్నగొంతుతో ఎవరో అడిగారు. అటు తిరిగి చూశాను. రెండు చేతుల నిండా పుస్తకాలు పెట్టుకొని అమ్మకానికి వచ్చిన మనిషి. వద్దు అన్నాను. అయినా వినిపించుకోకుండా 'దాంపత్య సుఖం' 'మొదటి రాత్రి' 'అరవై...' 'వద్దయ్యా' అన్నాను గట్టిగా. ఏమనుకున్నాడో! నన్ను ఎగాదిగా ఒక్కసారి చూసి పక్క కంపార్టుమెంటు వైపుకి వెళ్లిపోయాడు. 'అయ్- కెనకంబరాలూ- సంఫెంగి పువ్వులూ' అంటూ అరుచుకుంటూ నా పక్కనుంచే పోయాడు పువ్వులమ్మేవాడు! వాడి కేకకి చెవులు గింగురుమన్నాయి. కొంచెం దూరంలో ద్రాక్షపళ్ళవాడు కనిపించాడు. కాసిని కొని స్వాములవారికిద్దామని వాడివైపుకి నడిచాను. వెనక నుంచి ఎవరో నన్ను పేరు పెట్టి పిలిచినట్లనిపించింది. ఆడగొంతు. అనుమానంతో వెనక్కి తిరిగి చూశాను. సుధ! ఒక్క అంగలో వచ్చి నా చేతులు రెండూ పట్టుకుంది.

'నువ్వేలా వచ్చా విక్కడికి?' అన్నాను.

'నువ్వేలా వచ్చావో చెబుదూ' అంది చింకి చాటంత మొహం చేసుకుని.

'వాల్తేరు వెడుతున్నాను- హైదరాబాదు నుంచి'.

'మేమిక్కడే ఉంటున్నాం. ఇప్పుడు. ఈ మధ్యనే ఇక్కడికి బదిలీ అయింది, ఒక్కపూట మా ఇంట్లో ఉండి వెళ్లు రమా.'

'అబ్బే, పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈసారి సెలవుల్లో వస్తాలే రా, నా కంపార్టుమెంటుకి పోదాం, కాస్సేపు కూర్చుని మాట్లాడుకోవచ్చు' అన్నాను.

'ఉండు, మా వారికి పరిచయం చేస్తాన్నిన్ను' అంటూ కొంచెం దూరంలో నుంచుని మా వైపే చూస్తున్న ఒక ఆజానుబాహుణ్ణి పిలిచి 'ఈయనే' అంది. నమస్కరించాను.

'మా రమ అండీ' అంది ఉత్సాహంగా. అతను నవ్వుతూ 'అయితే మీ స్థానంలో నన్నమాట నేనున్నది' అన్నాడు.

'అంటే?' తెల్లబోతూ అడిగాను.

"అహ" 'మా రమా నేనూ చిన్నప్పటి నుంచీ ఓ కంచంలో తిని ఓ మంచంలో పడుకునే వాళ్ళం' అని చెప్తూ ఉంటుంది సుధ." అతని మాటలికి సిగ్గుపడుతూ నవ్వాను.

'ఒక్క పూటకి దిగు రమా' అంది సుధ మళ్ళీ బతిమాలుతున్న ధోరణిలో.

'రాజమండ్రీ ఎప్పుడూ చూడలేనట్లుంది' అన్నాడతను.

'ఆ. ఇంతోటి రాజమండ్రీ సందులూ గొందులూ చూడలేకపోతుం దనేమిటి! నా కోసం దిగమంటున్నాను గాని' అని సాగదీసింది సుధ.

'సర్లే. నీ కోసమే లే. నా కోసం అనుకోవడం లేదు.' అన్నాడు.

'బాబోయ్, దిగుతానర్రా. దెబ్బలాడుకోకండి' అన్నాను నవ్వుతూ. అమాంతం నా నడుముని వాటేసుకుంది సుధ.

'ఊఁ, ప్రేమలు తరువాత చూపించుకుందురుగాని, ముందు సామాను దించుకోండి' అన్నాడతను.

గబగబా నా కంపార్టుమెంటు దగ్గరికి వెళ్ళాం. స్వాముల వారిని

చూడగానే ఎందుకో నా మనస్సు చివుక్కుమంది. వాల్తేరు దాకా వెడుతున్నానని చెప్పి మధ్యలో దిగిపోతుంటే ఆయన్ని దగా చేస్తున్నట్లుగా అనిపించింది. స్వాములవారికి సుధనీ, ఆమె భర్త రాజారావునీ పరిచయం చేశాను.

'స్వామీజీ! సుధ వాళ్ళింట్లో ఓరోజు ఉండమని బలవంతం చేస్తోందండీ. ఇక్కడ దిగిపోతున్నాను' అన్నాను తప్పు చేస్తున్న దానిలా మొహం పెట్టి. ఆయన మాత్రం చిరునవ్వు నవ్వారు.

'అలాగే వెళ్ళిరామ్మా, మళ్ళీ కలుసుకుందాం' అన్నారు, ఆశ్చర్యంతో ఆయనవైపు చూశాను. ఆయన కన్నుల్లోని ఆత్మవిశ్వాసం చూశాక 'ఎలా' 'ఎప్పుడు' అంటూ ప్రశ్నించ బుద్ధి కాలేదు. ఆయనకి పాదాభివందనం చెయ్యాలనిపించింది. సామాను తీసుకుని "వెళ్ళొస్తానండీ" అన్నాను. నన్ను సాగనంపడానికి గుమ్మందాకా వచ్చారాయన.

రైలు కనుచూపు మేర దాటిపోయేవరకూ స్వాములవారిని చూస్తూ చెయ్యి ఊపాను.

"మీకి సాధుసంపర్కం ఎప్పటి నుంచి?"

వెనక్కి తిరిగి చూశాను. రాజారావు కొంటెగా నవ్వుతున్నాడు నోట్లో జానెడుపొడుగు చుట్టతో దర్పంగా చూస్తున్నాడు.

"సజ్జన సాంగత్యానికి సాధువేమిటి, సంసారేమిటి?"

"బాగా చెప్పారు!" అంటూ గుప్పున పొగ వదిలాడు. అతని వెటకారానికి ఒళ్ళు మండింది. సుధ ఇదేమీపట్టించుకోలేదు. "పద రమా" అంది నా చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ. "ఒద్దులే, నే పట్టుకుంటాను" అన్నాను విడిపించుకుంటూ. 'ఇలా ఇవ్వండి' అన్నాడు రాజారావు.

'పరవాలేదులెండి' అన్నాను. చటుక్కున చేతిలోంచి లాక్కున్నాడు. సుధ వైపు చూశాను 'ఏమిటీయన' అన్నట్లు. సుధ నా చెయ్యి పట్టుకుని ముందుకి నడిచింది.

స్టేషను బయటకు రాగానే జట్కా మాట్లాడాడు రాజారావు. ముందు సుధ ఎక్కింది. తరవాత నేనెక్కబోయాను. కాలు కొంచెం జారింది మళ్ళీ ఎక్కడానికి ప్రయత్నిస్తూంటే రాజారావు జట్కావాణ్ణి కేకేసి 'కొంచెం బండి వెనక్కి దించవోయ్. మరీ వేలుడేసి మనుషులు!' అన్నాడు. సుధ ఫక్కుమని నవ్వింది. ఉడుకు మోత్తనం వచ్చినా పైకి కనబరచకుండా 'చూసుకోండి నా తఢాకా' అన్నట్లుగా వెనకనుంచి చిన్న ఎగురు ఎగిరి బండిలో కూర్చున్నాను. నేను సర్దుకోగానే రాజారావు కూర్చున్నాడు. వెంటనే బండి వెనక్కి దిగజారిపోయింది. గుర్రంమీది కాడి పైకి లేచిపోయింది. గుర్రం సకిలించింది.

'బాబయ్యా, కాసింత ముందుకి రండయ్యో' అన్నాడు జట్కావాడు. నేను ముందుకి జరిగాను బాగా. బండింకా వెనక్కి ఒరిగిపోయే ఉంది. 'మీరట్టా కాళ్ళు యాల్లాడేస్తే కాదు, పైకి రండి బాబయ్యా,ముందుకి జరికూర్కోండయ్యా'. బండివాడి గోలకి రాజారావు బాగా పైకి జరిగి నేనూ సుధా ఆక్రమించినంత స్థలం తనొక్కడూ ఆక్రమించాడు. అతని మోకాలూ, భుజం నాకు రాసుకుంటున్నాయి. ఇబ్బందిగా ఉన్నా గమనించనట్లు ఊరుకున్నాను.

'సరస్వతీ పవర్ ప్రెస్' దగ్గరికి పోనీవోయ్ అన్నాడు రాజారావు. జట్కావాడు కొరడా ఝళిపించాడు. గుర్రం పరుగు లంకించుకుంది. రాజారావు చుట్టపొగ జట్కాలోపల దట్టంగా వ్యాపించింది. నాకు ఊపిరి సలపక దగ్గొచ్చింది.

'కాస్త ఆ వెధవ చుట్ట ఆరిపెయ్యకూడదుటండీ, రమకి పట్టంలేదు' అంది సుధ. నావైపు చూశాడతను. చూపు తప్పించుకుని బయటికి చూశాను. రాజారావు చుట్ట ఆరిపేశాడు. వ్యాపించిన పొగ ఇంకా బయటికి పోలేదు.

ఓ రెండంతస్తుల మేడ దగ్గర బండి ఆపించారు. రాజారావు ఒక్క గెంతులో దిగాడు. ఆ అదుటుకి బండిలో ఉన్న మేము ఒక్క ఎగురుకి టాపుకి ఠక్కుమని కొట్టుకొన్నాం. నేనూ, సుధా బండి దిగి ఇంట్లోకి దారి తీశాం. వీళ్ళుంటున్నది మేడమీద భాగంలో. మెలికలు తిరిగిన మెట్లమీంచి జాగ్రత్తగా నడుచుకుంటూ పోయాం పైకి. రాజారావు సూట్‌కేస్‌తో మా వెనకాలే వచ్చాడు.

ఉంటున్నది రాజమండ్రీలో అయినా ఇల్లు చాలా అందంగా అలంకరించి పెట్టింది సుధ. గుమ్మాలకు అందమైన తెరలూ, డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలూ వాటిమీద పువ్వులు కుట్టిన గలేబులూ, పక్కల్ని వాజుల్లో తాజాపువ్వులూ, గోడలమీద ఒకటి రెండు వర్ణచిత్రాలూ—చూడగానే వాతావరణం చాలా హాయిగా అనిపించింది. ఓ సోఫాలో కూలబడ్డాను. సుధ లోపలికి వెళ్ళింది కాఫీ తీసుకొస్తానని చెప్పి. బల్లమీదున్న పత్రికలు చూస్తూ కూర్చున్నాను. ఆరిపోయిన చుట్టని వెలిగించుకున్నాడు రాజారావు.

సుధ కాఫీ పట్టుకొచ్చింది. స్టీలుగ్లాసుల్లో కాకుండా కప్పుల్లో పట్టుకొచ్చింది. కాఫీ తాగుతూ 'కప్పులు చాలా అందంగా ఉన్నాయి'అన్నాను.

'అంతకన్న కాఫీ ఘోరంగా ఉందని స్పష్టంగా చెప్పొచ్చును కదా'—నవ్వుతూ అన్నాడు రాజారావు. సుధ చిన్నబుచ్చుకుంటుందేమో

నన్న భయంతో వెంటనే 'కాఫీ అద్భుతంగా ఉంది, కప్పులు కూడా తగి నట్లు అందంగా ఉన్నాయని నా ఉద్దేశం' అన్నాను. సుధ నవ్వింది.

"మాపెళ్లికి ఎవరో ప్రెజెంట్ చేశారు వీటిని" అంది.

"అవునుగాని, మాపెళ్లికి రాలేదేమిటి మీరు?" రాజారావు అడిగాడు

"మీరు పిలిస్తే కదా!"

"ఊఁ, గట్టి చిక్కొచ్చిపడిందే.... అయినా మీస్నేహితురాలు పిలిస్తే నే పిలిచినట్టు కాదూ?" అన్నాడు.

"మాసుధ నన్నేమీ నిలదీసి అడగటం లేదు—నాపెళ్ళికి రాలే దేమిటని."

'పరవాలేదు, పిట్టకొంచెమైనా కూత ఘనమే' అన్నాడు నవ్వుతూ.

'ఏమిటండోయ్! మరీ చిన్నపిల్లని ఆడించినట్లు ఆడిస్తున్నారు దాన్ని' అంది సుధ నన్ను వెనకేసుకొస్తూ.

'చిన్నపిల్లకాదూ! మారమ, మారమ-అని నువ్వంటూంటే నీలాగే ఉంటుందనుకున్నాను' అని చేతుల్తో సుధ లావుని సూచించాడు.

ఈసారి సుధని వెనకేసుకు రావటం నావంత యింది. 'మా సుధ ఇంతకు ముందెంతో నాజూగ్గా ఉండేది. ఇప్పుడు సహవాసదోషం వల్ల అలా పాడై పోయింది గాని!'

నామాటలికి సుధ పకపకా నవ్వింది. రాజారావు మోహం ముడుచు కుంటాడనుకున్నాను—అతని స్థూలదేహాన్ని ఎత్తిపొడుస్తున్నందుకు. ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. హాయిగా సోఫాలో జార్లబడ్డాను.

'ఏం, హైదరాబాదు ఎందుకెళ్లావ్?' సుధ అడిగింది.

'అమ్మ, నాన్నగారూ అక్కడే ఉన్నారు. క్రిందటేడు నాన్నగారికి హైదరాబాదు బదిలీ అయింది. ఈ ఒక్క సంవత్సరంతో నా చదువై పోతుంది కదా-మధ్యలో మార్చెందుకని నన్ను వాల్తేరులో పిన్నివాళ్లింట్లో ఉంచారు.

'ఊరికే చూద్దామనే వెళ్లావా, ఏదన్నా ఇబ్బందొచ్చిందా?'

'ఓ విధంగా ఇబ్బందే'.

ఏమిటేమిటంటూ గాభరాగా చూసింది సుధ.

'అమ్మనీ నాన్నగార్నీ ఎదిరించాల్సి వచ్చింది' అన్నాను బాధగా.

'సంబంధం చూశారా' అంది కన్నుగీటుతూ. అవునన్నాను. 'ఎవ రతను' అని అడిగింది.

'డాక్టర్ చంద్రశేఖరం అని మానాన్నగారి స్నేహితుడి కొడుకు. తరుచు వస్తూ పోతూ ఉంటారు మాఇంటికి. అక్కడ యూనివర్సిటీలో పని చేస్తున్నాడు.'

'మరెందుకొద్దన్నావ్? మనిషి బావుండడా?'

'అబ్బే, అదికాదు. అతన్ని పెళ్లి చేసుకోవాలన్న అభిప్రాయం నాకెప్పుడూ కలగలేదు. అదీకాక, మూర్తితో మొదటినుంచీ నాకు పరిచ యం. అతన్నే చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. మూర్తి మన శాఖ వాడు కాదు. పైగా హోదా కూడా తక్కువేనని అమ్మకీ నాన్నగారికీ అయిష్టత. ఈరోజుల్లో కులాలే పట్టించుకోవటం లేదు-ఇక శాఖలంటూ మూర్ఖంగా కూర్చుంటే ఎలా?'

సుధ అంత ఉత్సాహం కనబరచలేదు 'ఎంతయినా తల్లితండ్రులు మన మంచి ఆలోచించే చూస్తారు కదా ఏ సంబంధమైనా, వాళ్ళమనసు నొప్పించకుండా ఉండాల్సింది' అంది.

'నాకేది మంచిదో నాకు మాత్రం తెలియదూ ఇంత వయస్సొచ్చాక. జీవితాంతం సహచరులుగా ఉండాల్సిన విషయంలో తగినవాణ్ణి ఎన్నుకునే బాధ్యత నేను తీసుకుంటే తప్పేముంది' అంటూ నన్ను నేను సమర్థించుకున్నాను,

సుధ తేలిగ్గా నవ్వేస్తూ 'పోనీలే, ఎవరో ఒకరు నీకు నచ్చితే నీ జీవితం సుఖంగా సాగుతుంది. అంత కన్న మీ వాళ్ళకి మాత్రం కావల్సిం దేమిటి?- అలా అనుకుని సరిపెట్టుకుని ఉంటారు మీవాళ్ళు.

కాఫీ కప్పులు తీసుకుని లోపలికి వెళ్ళింది సుధ. రాజారావు బట్టలు మార్చుకుని వచ్చాడు, తెల్లని దోవతి, ఖద్దరు లాల్చీ వేసుకున్నాడు. మొట్ట మొదటి సారిగా, 'మగవాడు ధోవతిలో కూడా అందంగా ఉండొచ్చును' అనుకున్నాను.

'ఏం, ఎలా ఉంది మాఊరు' అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

'ఏదీ, ఇలకా చూపించండే ఏం చెప్పను?

సుధని కేకేశాడు వెంటనే. ఏమిటంటూ కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది.

'మీ స్నేహితురాలికి ఊరు చూపించలేదని అలకొచ్చింది'. కొంటెగా నవ్వుతూ అన్నాడు.

'చూశావా సుధా అంతా కల్పన'.

'పోనీ, దాని కేముంది? సాయంకాలం అలా పుష్కరేవు వైపు పోదాం. అట్నుంచి కావాలంటే మ్యూజియం అవీ చూసి రావచ్చు.... ఇప్పుడు మేటనీకి వెడదామా' అంది గారం చేస్తున్నట్టు,

'చంపావు పో, ఇప్పుడే బట్టలు మార్చుకున్నాను, మళ్ళీ చచ్చి చెడి సూటూ బూటూ వెయ్యమంటే ఎలా? దిగులుగా చూశాడు రాజారావు.

'ఫరవాలేదు, ఈ డ్రెస్‌లోనే ఎక్కువ బావున్నారు. ఇలాగే పదండి' అన్నాను చటుక్కున, అనేశాక నాలిక కొరుక్కున్నాను, రాజారావు మొహం కేసి మళ్ళీ చూడకుండా చూపులు సుధ వైపుకి మళ్ళించాను. సుధ అన్నం వడ్డించేస్తాను అంటూ వంటింటి వైపు వెళ్ళింది. నేను సుధ వెనకాలే వెళ్ళాను. గ్లాసులతో మంచి నీళ్ళు పెట్టి పీటలు వేస్తానన్నాను. వినకుండా నన్ను రెక్క పుచ్చుకుని బలవంతాన ఓ పీట వేసి కూర్చొబెట్టింది. అన్నీ చకచకా సర్దేసి రాజారావుని రమ్మని పిలిచింది. భోంచేస్తున్నంత సేపూ అవీ ఇవీ నాకు మారొడ్డించమని సుధని చంపుకుతిన్నాడు. చీటికీ మాటికీ నా బక్కపలచటవాన్ని వెక్కిరిస్తూంటే నేను ఊరుకోలేదు.

'ఆయనకి ఇంకాస్త వడ్డించు సుధా-మరీ నా తిండి చూసి మొహమాట పడుతున్నారు...మీ డోసు తగ్గించకండి. నేనేమీ అనుకోనులెండి' అన్నాను. పంతాలకు పోయి ముగ్గురం భుక్తాయాసంతో లేచాం.

సాయం కాలం ఆరున్నరకి సినిమా అయి పోగానే రామాటాకీసు నుంచి కాలి నడకనే బయల్దేరాం. మ్యూజియంకి వెళ్ళడం మానేసి అలా నడుస్తూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పుష్కరేవుకి వెళ్ళాం, అక్కడ మర్రి చెట్టు దగ్గర చిన్న దేవుడి గుడి ఉంటే సుధ అటు దారి తీసింది.

'ఏమేవ్, అటు వెళ్ళకు, ప్రమాదం' అన్నాడు రాజారావు. గాభరాగా చూశాం ఏమిటని.

'అక్కడ సాధువులున్నారే, చూసిందంటే మీ స్నేహితురాలు మళ్ళీ ఇంటికి రానంటుంది.

సుధ నవ్వుకుని ఇవతలి వైపు కొచ్చేసింది.

అతనిమీద ఎదురుదెబ్బ తియ్యటానికి అవకాశంకోసం కాచుకూర్చున్నాను.

బ్రిడ్జి స్తంభాల చుట్టూ చేరి కేరింతలు కొడుతూ నీళ్ళలో ఆడుతున్న పిల్లల్ని చూస్తూంటే నాకూ ఆ గోదావరిలో హాయిగా ఈతలాడితే బావుండునని పించింది. ఒడ్డున నుంచుని కాసిని నీళ్ళు తీసుకుని మొహం మీద పోసుకుని, పాదాలు తడుపుకుని తృప్తిపడి ఇవతలి కొచ్చేశాను. తరువాత ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాం. పువ్వులూ కొబ్బరికాయలూ పట్టుకుని దేవుడికి దణ్ణం పెడుతూంటే రాజారావు నావైపు తిరిగి 'ఏమని కోరుకున్నారు? 'అన్నాడు.

'మీతో ఎందుకు చెప్పాలి?'

"నాకు తెలుసు మీరు చెప్పకపోయినా."

"ఏమిటి చెప్పండి చూద్దాం "

'మొగలీ పువ్వంటి మొగుణ్ణివ్వవే.... అంటూ రాగం తీశాడు,

'ఛీ, నాకు మొగలిపువ్వంటే పరమ అసహ్యం.'

ఇదెక్కడి పిల్లరా బాబూ అనుకున్నట్లు భుజాలు ఒక్క విరుపు విరిచి అవతలికి వెళ్ళిపోయాడు.

దారిలో, హోటల్లో భోంచేద్దా మన్నాడు అప్పుడు వెళ్ళి ఇంట్లో సుధచేత వంట చేయించటం ఎందుకని, సుధ సంతోషించింది.

బోంచేసి నడుచు కుంటూనే ఇంటికి చేరుకున్నాం. రాత్రి తొమ్మిది దాటి పోయింది, అలిసిపోయాను నడిచి నడిచి, 'పేకాడు కుందామా' అంది సుధ నిద్రవస్తోంది, 'వద్ద 'న్నాను. డాబామీద ముగ్గురికీ పక్కలు వేసింది. కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాం-మధ్యాహ్నం చూసిన సినిమా గురించి ఉన్నట్టుండి 'చలేస్తోంది' అని రాజారావు ఇంట్లోకి వెళ్ళిపోయాడు నేను ఉగతగా కబుర్లు కొనసాగించాను. మరి కొంత సేపటికి సుధ కూడా లోపలికి వెళ్ళిపోయింది.

దూరం నుంచి నైట్‌క్వీన్ పరిమళం గాలి వీచి నప్పుడల్లా వచ్చి డాబా అంతా వ్యాపిస్తోంది. మామయ్య పడగ్గది ప్రక్కన ప్రత్యేకంగా నాటించిన నైట్‌క్వీన్ మొక్క ఈ పాటికి బాగా ఎదిగి ఇలాగే పరిమళాన్ని వెదజల్లుతూ ఉండి ఉంటుంది. తాతయ్యగారింట్లో వేసవికాలం పొగడ చెట్టుక్రింద పక్కలువేసేవారు. సెలవులికి వెళ్ళినప్పుడు రోజూ పొద్దున్నే లేచి నా పక్కమీద ఎన్నిపూలు రాలినవో లెక్కపెట్టుకునే దాన్ని,ఇప్పుడు పొగడ పువ్వుల మీద అంత మోజు లేదు, సన్నజాజిది చక్కని పరిమళం. నాజూకైన పువ్వు. నాజూకైన పరిమళం.

మత్తుగా ఒత్తిగిలాను.

సన్నజాజి సౌరభం.. సన్నాయి.. కొబ్బరి చెట్లు . తాటాకు పందిరి... పట్టుచీరల గరగరలు...మండువాలో పేరంటాళ్ళు, ముత్తయి దువలకు పసుపురాస్తోంది వదిన, ఎవరో గంధం పూస్తున్నారు. మామయ్య కూతురు శశి పన్నీరు జల్లుతోంది. నాకు పిన్ని పూలజడ వేస్తోంది. సన్నజాజులు గుచ్చుతోంది. మధ్యమధ్య కనకాంబరాలూ, మరువం వేస్తే బావుంటాయంటోంది, మరే పువ్వులూ కలపొద్దన్నాను, జడ ఇంకా సగం కూడా కాలేదు. పురోహితుల కేకలు-అమ్మాయిని తీసుకురండి' ...సన్న

జాజుల పోగుతరగటం లేదు. బావ మొగలి పువ్వులు పట్టుకొచ్చాడు. కత్తిరించి జడమీద కుట్టమన్నాడు, వద్దన్నాను. చాలా బావుంటుంది- పెట్టించుకోమన్నాడు. వద్దన్నాను మళ్ళీ, కావాలంటే వాసన చూడు ఎంత బావుందో అన్నాడు, 'బాబోయ్ నా దగ్గరకు తీసుకురాకు నాకసహ్యం'- కళ్ళు మూసేసుకున్నాను బావ పట్టుదల వదల్లేదు. ముక్కుదాకా తీసుకొచ్చాడు. పిన్ని చేతుల్లోంచి జడ వదిలించుకుని దూరంగా పరిగెట్టాను ముత్తయిదువులంతా నవ్వుతున్నారు. 'బావ మొగలిపువ్వుతో నా దగ్గరి కొస్తున్నాడు. ఇంక వెనక్కి వెళ్ళటానికి చోటులేదు, గోడ అడ్డుకుంది. బావ మొగలిపువ్వుని మొహంమీద పెట్టాడు, బుగ్గలికి తగిలిగీరుకున్నాయి మొగలి ఘాటుకి ఊపిరి సలపలేదు, ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. బావ వేడి ఊపిరికి తల తిరిగి నట్లయింది. ఎదిరించే శక్తి సన్నగిలింది. జడలో సన్నజాజులు గోడకి రాసుకుని నలిగి రాలి పడ్డాయి. కోపంతో ఒక్క తోపు తోశాను-బలాన్ని కూడ గట్టుకుని, ఆ కుదుపుకి మెలుకు వచ్చింది కళ్ళు తెరిచి చూశాను.

బావకాదు-మొగలిపువ్వుకాదు-ఎదురుగా రాజారావు. బుసలుకొడుతున్నట్లు ఊపిరి ఒదుల్తున్నాడు, నా చేతులు రెండూ మంచానికి అదిమి పెట్టి వున్నాయి. అరిచాను. నాగొంతు నాకే వినిపించలేదు, నా నోటి మీద మరో నోరు. ఘాటైన చుట్టవాసన. తల తిరిగి పోయింది, ఆపాద మస్తకాన్నీ అదిమి పెట్టిన ఆ బరువుని తోసే శక్తి నాలో లేక పోయింది నా అసహాయత్వానికి కళ్ళనీళ్ళు తిరిగాయి. సుధ వస్తే బావుండును అనుకున్నాను. పిలవ బోయాను, మళ్ళీ నా నోటిమీద నోరు, గుండెల మీద బరువు, కడుపులో దేవినట్లయింది. కాళ్ళు విరిగిన స్తంభాల్లా పడి ఉన్నాయి, నా వెన్నెముక కరిగిపోయి నట్లుంది, ఉన్నట్లుండి నామీద బరువు తొలిగిపోయింది, ఆ బరువు నానుంచి దూరంగా నడిచి పోయింది.

పోతూపోతూ నా శక్తినంతా కూడగట్టుకు పోయినట్టుంది. నీరసం ఆవరించింది. వంటిమీదికి గాలి చల్లగా వీచింది. అయినా అలానే చలన రహితంగా మంచాన్ని అంటి పెట్టుకుని ఉండి పోయాను, ఆకాశంవైపు చూశాను, చందమామ పాలిపోయినట్లు కనిపించింది, చుట్టూ నక్షత్రాలు బిక్కు బిక్కు మంటున్నాయి.

జరిగిన సంఘటనని మనస్సు మెల్లి మెల్లిగా పునశ్చరించుకుంటోంది. పువ్వుల గురించి ఆలోచిస్తూంటే ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు, పీడకల-దాని వెనుక రాజారావు-చలిగాలి, ఒళ్ళంతా జలదరించింది. జాకెట్టు బొత్తాలు పెట్టుకున్నాను. చీర మోకాళ్ళ క్రిందికి లాక్కున్నాను. ఒణుకు కొంత తగ్గింది, మళ్ళీ మనస్సులో ఆలోచనలు-

'నా కెందుకు జరిగిందిలా? నే నింత అబల నెలా అయిపోయాను? కళ్ళనిండా నీరునిండి రెండు కను కొలకుల్లోంచీ జారి చెంపలూ చెవులూ తడిశాయి. కోపం, ఆవేశం, బాధ, భయం, జాలి, అసహ్యం-ఒక్కసారిగా అనుభవించాను, 'నాకెందుకు జరిగిందిలా?' నా మూగ ప్రశ్నకి జవాబు చెప్పడానికి అక్కడెవరూ లేరు-ఆకాశం క్రింద నేను తప్ప, తెల్లవారకుండా ఉంటే బావురడు ననుకున్నాను, గోడదూకి ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను, పారిపోయి గోదావరిలో దూకుదామా అనుకున్నాను, చీరకొంగుతో ఉరి పోసుకుందామా అనుకున్నాను ఏదీ చెయ్యలేదు. మంచాన్ని అంటి పెట్టుకుని అలాగే ఆకాశం వైపు చూస్తూ కర్తవ్యం తోచక ఆలోచిస్తూ ఉండి పోయాను. అలసటలో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

ఎండ కళ్ళలో పడగానే మెలుకువొచ్చింది, చటుక్కున లేవబోయాను, ఒళ్ళంతా బడలికగా చచ్చుగా ఉన్నట్లనిపించింది. జరిగిన

సంఘటన కళ్ళకు కట్టినట్లయింది. లేవబుద్ధి కాలేదు. లేస్తే అతను కనిపిస్తాడేమో! సుధ మొహాన్ని ఎలా చూడను! నా మొహాన్ని నేనెలా చూసుకోను? ఏం చెయ్యాలో ఎలా ప్రవర్తించాలో అర్థంకాక అలాగే కళ్ళు మూసుకు పడుకున్నాను. మూర్తి మనస్సులో మెదిలాడు. మూర్తి-ప్రేమ వివాహం-అన్నీ అకస్మాత్తుగా అపరిచితంగా తోచాయి. భావి జీవితమంతా అస్పష్టంగా పొగమంచు కమ్మినట్లుగా ఉంది. ఈ సంఘటన నా మనఃప్రవృత్తిలో నే నింతకుముందు ఊహించని పరిణామాన్ని తెస్తున్నట్లు తోచింది. నేనిదివరకటి దాన్ని కాదిప్పుడు-శారీరకంగా గాని, మానసికంగా గాని. ఈమార్పు నా జీవనాన్ని ఎలా తీర్చిదిద్దుతుందో తెలియదు. మూర్తి ప్రేమ నిన్నటి వరకూ సజీవరూపంలో నాఎదుట నిలిచింది. ఈరోజు బుద్బుదమై గాలిలో తేలి నానుంచి దూరమైపోతున్నట్లు తోస్తున్నది. ఎప్పుడు బుద్బుదం అదృశ్యమవుతుందో తెలియదు. నిన్నటికీ ఈరోజుకీ ఎంత భేదం! ఇలా జరక్కపోయి ఉంటే?—నిన్న అనుకున్నాను-వాల్తేరు వెళ్ళగానే విజయగర్వంతో మూర్తిని పిలుస్తాను. "అమ్మ, నాన్నగారూ అడ్డుచెప్పినా సరే, శేఖరాన్ని కాదని నీదగ్గరికి వచ్చాను మూర్తీ" అంటాను. మూర్తి ఆనందంతో ఉప్పొంగి పోయి తన బాహుబంధనలో నన్నుక్కిరిబిక్కిరి చేస్తాడు...' ఇప్పుడు—వాల్తేరు వెడతాను. మూర్తిని కలవకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. మూర్తి మొహం చూడలేక తప్పించుకు తిరుగుతాను. ఓరోజున మూర్తి కలుస్తాడు. చెబుతాను. "మూర్తీ, వస్తూవస్తూ దారిలో నాశరీరాన్ని మలినం చేసుకు వచ్చాను" అని. మూర్తి ఏమంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు? నన్ను అసహ్యించుకుంటాడా? అవును. ఎందుకు అసహ్యించుకోకూడదు? నా అబలత్వానికీ, నా అశక్తతకీ, నా బుద్ధిహీనతకీ నన్ను ఛీత్కరించుకుంటే ఆశ్చర్యం ఏముంది?, నామీద నాకే అసహ్యంగా ఉంది, ఇప్పుడు నా

సంఘటన కళ్ళకు కట్టినట్లయింది. లేవబుద్ధి కాలేదు. లేస్తే అతను కని పిస్తాడేమో! సుధ మొహాన్ని ఎలా చూడను! నా మొహాన్ని నేనెలా చూసు కోను? ఏం చెయ్యాలో ఎలా ప్రవర్తించాలో అర్ధంకాక అలాగే కళ్ళు మూసుకు పడుకున్నాను. మూర్తి మనస్సులో మెదిలాడు. మూర్తి-ప్రేమ వివాహం-అన్నీ అకస్మాత్తుగా అపరిచితంగా తోచాయి, భావి జీవితమంతా అస్పష్టంగా పొగమంచు కమ్మినట్లుగా ఉంది. ఈ సంఘటన నా మనః ప్రవృత్తిలో నే నింతకుముందు ఊహించని పరిణామాన్ని తెస్తున్నట్లు తోచింది. నేనిదివరకటి దాన్ని కాదిప్పుడు-శారీరకంగా గాని, మానసి కంగా గాని. ఈమార్పు నా జీవనాన్ని ఎలా తీర్చిదిద్దుతుందో తెలియదు. మూర్తి ప్రేమ నిన్నటి వరకూ సజీవరూపంలో నాఎదుట నిలిచింది. ఈరోజు బుద్బుదమై గాలిలో తేలి నానుంచి దూరమైపోతున్నట్లు తోస్తు న్నది. ఎప్పుడు బుద్బుదం అదృశ్యమవుతుందో తెలియదు. నిన్నటికీ ఈరోజుకీ ఎంత భేదం! ఇలా జరక్కపోయి ఉంటే?—నిన్న అను కున్నాను-వాల్తేరు వెళ్ళగానే విజయగర్వంతో మూర్తిని పిలుస్తాను. "అమ్మ, నాన్నగారూ అడ్డుచెప్పినా సరే, శేఖరాన్ని కాదని నీదగ్గరికి వచ్చాను మూర్తీ" అంటాను. మూర్తి ఆనందంతో ఉప్పొంగి పోయి తన బాహుబంధనలో నన్నుక్కిరిబిక్కిరి చేస్తాడు...' ఇప్పుడు—వాల్తేరు వెడతాను. మూర్తిని కలవకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. మూర్తి మొహం చూడలేక తప్పించుకు తిరుగుతాను. ఓరోజున మూర్తి కలుస్తాడు. చెబుతాను. "మూర్తీ, వస్తూవస్తూ దారిలో నాశరీరాన్ని మలినం చేసుకు వచ్చాను" అని. మూర్తి ఏమంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు? నన్ను అస హ్యించుకుంటాడా? అవును. ఎందుకు అసహ్యించుకోకూడదు? నా అబల త్వానికీ, నా అశక్తతకీ, నా బుద్ధిహీనతకీ నన్ను ఛీత్కరించుకుంటే ఆశ్చర్యం ఏముంది?, నామీద నాకే అసహ్యంగా ఉంది, ఇప్పుడు నా

కేమిటి శిక్ష? ఎవరు విధిస్తారు నాకు తగిన శిక్ష? నాకు నేనే విధించుకోనా? ఏం శిక్ష విధించుకోను? ఓ భగవంతుడా! మాట్లాడవేం? నీ మౌనమే నాకు శిక్ష?

'రమా, లేస్తావా, కాఫీ తీసుకుందు గాని' అంటూ సుధ నన్ను మృదువుగా తట్టి లేపింది. కళ్ళు తెరచి చూశాను సుధ మామూలు గానే ఉంది. పక్కమీంచి లేచాను. చెంపలికి కట్టిన కన్నీటి చారలు కనిపిస్తా యేమోనని కొంగు తీసి తల చుట్టూ కప్పుకున్నాను, వాచిన కళ్ళు కని పించకుండా కళ్ళజోడు సమయానికి నన్నాదుకుంది. సుధ నా మొహం లోని మార్పును గమనించినట్లు లేదు, సుధకి తెలియదన్నమాట, తెలిస్తే? పక్క సర్దటం మొదలు పెట్టాను.

'వద్దులే, పనిమనిషి సర్దుతుందిలే, నువ్వు లోపలికి పద' అని లోపలికి దారితీసింది, మౌనంగా అనుసరించాను. లోపలికి వెళ్ళాక చెంబుతో వేణ్ణీళ్ళు అందించింది. నా చేతిసంచీలోంచి బ్రష్షూ, పేస్టూ అవీ తీసుకున్నాను. పళ్ళు తోముకున్నాక మొహం వేణ్ణీళ్ళతో కడుక్కుం టూంటే బుగ్గలు మండాయి. నోట్లో కొత్తవాసన ఇంకా అలాగే ఉన్న ట్లనిపించి భళ్ళున డోకొచ్చినట్లయింది. వికారానికి కళ్ళ నీళ్ళు తిరిగాయి మొహం తుడుచుకుని లోపలికి వెళ్ళాను. కాఫీ గ్లాసుతో సిద్ధంగా ఉంది సుధ. మాట్లాడక పుచ్చుకున్నాను. ఏం మాట్లాడాలో తెలియదు, ఏమీ జరగ నట్లు ఎలా దులుపుకుని మామూలుగా ఉండాలో అర్థం కాలేదు. నేను మామూలు మనిషి నయేట్లు హఠాత్తుగా ఏదన్నా జరిగితే బావుండునని అనుక్షణం అనుకున్నాను. పోనీ సుధ మాట్లాడదేం? తెలుసునా? తెలిస్తే ఎందుకు ఊరుకుంది? ముందే తెలుసా? తరవాత తెలిసిందా? ముందే తెలిస్తే ఎలా ఒప్పుకుంది? తరవాత ఎలా తెలిసింది? సుధ ఏమన్నా అంటే బావుండుననుకున్నాను.

'ఉప్మా చేశాను, తింటావా?' అంది. 'ఊఁ' అన్నాను. చచ్చేటంత నీరసంగా ఉంది. ఆశ్చర్యపోయాను-అంత జరిగాక కూడా తిండి మీదికి దృష్టి ఎలా పోయిందని? పొగలు కక్కుతూన్న ఉప్మా ప్లేటులో పెట్టి పట్టుకొచ్చింది.

'నువ్వు తీసుకోవూ?' అన్నాను.

'ఆయనతో కలిసి తీసుకున్నాను ఇందాకనే' అంటున్నప్పుడు మామూలుగా భర్తమీది ఎప్పటి భక్తి వాత్సల్యాలే ధ్వనించాయి. సుధకి ఏమీ తెలియదా? తెలియకపోతే నేను చెప్పాలో వద్దో తెలియలేదు. మౌనంగా ఉప్మా తిన్నాను. సుధ కూర తరుక్కుంటోంది. నేను మౌనంగా ఉన్నానేమని కూడా అడగలేదు అంటే నేను మామూలుగానే కనిపిస్తున్నానా? నా ఆత్మ నిగ్రహానికి నన్నే అభినందించుకున్నాను.

టైము చూసుకున్నాను, తొమ్మిదయింది, ఆశ్చర్యం వేసింది. అంత సేపు ఎలా పడుకున్నానా అని. ఇంక గంటన్నర టైముంది రైలుకి.

'టైమవుతోంది, స్నానం చేస్తాను సుధా.'

'అలాగే. నువ్వు తెమిలే లోపల నేనూ వంట పూర్తి చేసుకుంటాను భోంచేసి స్టేషనుకు వెళ్ళొచ్చును ఇద్దరం.'

'ఎందుకు సుధా నీకు శ్రమ, నేను వెళ్ళగలను,'

'బావుంది! ఒక్కర్తెనీ ఎలా పంపించమన్నారు! ఆయనకి ఏదో అర్జంటు పని ఉందని వెళ్ళారు, వీలైతే అట్నుంచి స్టేషనుకి వస్తానన్నారు మనిద్దర్నీ వెళ్లమన్నారు. భోంచేసి.'

వేణ్ణీళ్లు తొలిప్పెంటింది స్నానానికి. స్నానం చేస్తూంటే జుగుప్స కలిగింది. రాజారావు స్పర్శ తలపు కొచ్చి తేళ్లూ జెర్రులూ పాకినట్లని పించింది. ఈ పైపై ప్రక్షాళనం ఉత్తి దండగ అనిపించింది. ఎలాగో నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుని చీరచుట్ట పెట్టుకుని బయటికొచ్చాను.

తలదువ్వుకుని బొట్టుకుని వచ్చేటప్పటికి రెండు కంచాల్లో అన్నం వడ్డించింది సుధ. కూర్చున్నానన్నమాటేగాని ఒక్క ముద్ద నోట్లోపెట్టుకో బుద్ధికాలేదు.

'అదేమిటి వంట బావుండలేదా?' అని నొచ్చుకుంది సుధ.

'కాదు, ఆకలిగా లేదు' అని లేదాను.

ఇల్లంతా సర్దుకుని సుధ కూడా సిద్ధమయింది. ఇద్దరం రిక్షా మాట్లాడుకుని స్టేషనుకి బయలుదేరాం. రిక్షా వెడుతున్నంత సేపూ నేనేం మాట్లాళేదు. రోడ్డు వైపున దుకాణాల్ని చూస్తూ కూర్చున్నాను. మౌనంగా కూర్చున్నా నన్న స్పృహ మాత్రం మనస్సుని కెలుకుతూనే ఉంది. సుధతో పొద్దుటి నుంచీ ఏం మాట్లాడాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. నిన్నటిలా చనువుగా తేలిగ్గా మాట్లాడ్డానికి వీలవటంలేదు. సుధకీ నాకూ మధ్య రాజారావు గోడలా నిలిచాడు.

'రమా, మళ్లీ ఎప్పుడొస్తావ్?' అంది హఠాత్తుగా.

'మళ్ళీనా'? నాకే తెలియదు. అలా ఎందుకు శెట్టించానో—అనాలోచితంగా అలా ఎందుకన్నానో? సుధ చటుక్కున నా చేతులు రెండూ పట్టుకుని 'నన్నుక్షమించు' అంది. సుధమొహం పాలిపోయింది. ఆ క్షణంలో సుధని చూస్తే జాలేసింది.

'ఛీ, అదేమిటి, మధ్య నువ్వేం చేశావ్?' అన్నాను తేలిగ్గా కొట్టే

పారేస్తున్నట్లు, ఆ క్షణంలో ఒకరి నొకరం అర్థం చేసుకున్నట్లుగానూ, ప్రపంచంలోని సమస్యలన్నీ పరిష్కృతమయిపోయినట్లుగానూ తోచింది.

స్టేషనుకి వెళ్ళగానే కనుక్కుంటే రైలు గంట లేటని చెప్పారు. ఆ గంటసేపూ సుధతో ఎలా గడపటమా అని చిరాకు పడ్డాను. కొంతసేపు ప్లాట్‌ఫామ్ మీద మౌనంగా ఇటూ అటూ తిరిగాం. ఉన్నట్టుండి సుధ 'అలా రా రమా, అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం' అంది. ఇద్దరం ప్లాట్‌ఫామ్ చివరగా వెళ్ళి ఇనప కటకటాల పక్కగా ఇసుకమీద కూర్చున్నాం-జనానికి దూరంగా. నేనేమీ మాట్లాళ్లేదు చేతి సంచీ తాడు మెలిపెడుతూ కూర్చున్నాను. సుధే మొదలు పెట్టింది.

'ఇప్పుడేం చెయ్యదలుచుకున్నావ్?' తల వొంచుకుని గులకరాళ్ళు పోగుచేస్తూ అడిగింది.

'నువ్వే చెప్పు' అన్నాను ఒకనవ్వు నవ్వి—ఆరిపోయే ముందు దీపం భగ్గుమని వెలిగే వెలుగులాంటి నవ్వు.

'నిన్ను అన్యాయం చేశాను...నీకు అన్యాయం చేశాను. నీ కింత అన్యాయం జరుగుతుందను కోలేదు.'

అబ్బ, చాల్లెద్దూ, ఈ కబుర్ల కేమిటి-అనుకున్నాను.

'ఆయన కదొక్కటే లోపం....'

సుధ కళ్ళలోకి చూశాను. అల్లరిచేసే కొడుకు గురించి తల్లిపడే బాధ సుధ కళ్ళలో కనిపించింది.

'మళ్ళీ నాకేవిధమయిన లోటూ రానివ్వరు డబ్బులోగాని, నిత్యావసరాల్లో గాని-దేనిలోనూ కించిత్తు లోటు రానివ్వరు. నాకు రవంత బాధ కలగనివ్వరు....'

అయ్యో పిచ్చిదానా-అనుకున్నాను.

'నిజం రమా, మాకాపురం విషయంలో కూడా నన్నే విధంగానూ అశ్రద్ధ చెయ్యరు- కాని, అదొక్కటే ఆయన కున్న లోపం...'

చాలదూ-అనుకున్నాను.

'మాది ప్రేమ వివాహం కాదు, పెద్దవాళ్ళు చూసి చేసిన సంబంధమే, కాని ఆమాట కొస్తే మాది 'తొలిచూపులో ప్రేమ' అని చెప్పొచ్చు. నన్ను తప్ప మరెవర్నీ పెళ్ళి చూపులు చూట్టానికి వెళ్ళలేదాయన, నన్ను చూడగానే ఒప్పుకున్నారు. మావాళ్ళు తగినంతగా కట్నం అదీ ఇవ్వలేరని ఆయన తల్లి తండ్రులు వెనక దీస్తూంటే ఆయన కాదూ కూడదని పట్టు పట్టి మరీ చేసుకున్నారు నన్ను...'

రాజారావు గురించి నా అనుభవం, అభిప్రాయం వేరు. అటువంటి వాడి గురించి భక్తి వాత్సల్యాలతో సుధ చెప్పుకు పోతూంటే నేనేమనను? మాట్లాడక వింటున్నాను.

'స్వల్ప విషయంలోనైనా నన్ను నిర్లక్ష్యం చేస్తే నేను నిస్పృహ చెంది పోతాను. ఆత్మవిశ్వాసం నశించి పోతుంది. ఆయన్ని పదే పదే అడుగుతాను-నన్ను ప్రేమిస్తున్నారా, నేనంటే మీకు ప్రేమేనా-అని, నేనడిగి నప్పుడల్లా ఆయన నన్ను దగ్గరికి తీసుకుని 'నేను వందమందితో పోయినా సరే మళ్ళీ నీ దగ్గరికే వస్తాను. నువ్వులేకపోతే పిచ్చెత్తిపోనుటే' అంటారు. ఇలా అని ఒకసారికాదు, కొన్ని వందల సార్లు అన్నారు.

నామీద అంత ప్రేమ, పిచ్చి ఉంటే వందమందితో పోవడ మెందుకని నేను అడక్కపోలేదు...'

సరిగ్గా నా నోటి చివరదాకా వచ్చింది- ఇలా అడక్కపోయావా- అని సుధతో అందామని. ఫరవాలేదు, అడిగిందన్నమాట. మరేమన్నాడు? కుతూహలంగా సుధవైపు చూశాను.

'...అన్నం తినకపోతే చచ్చిపోతాం. అలాగని చిరుతిళ్ళు అవీ తినకుండా ఉంటామా? ఏదైనా కొత్తగా స్వీటు కనిపిస్తే తినాలనిపించదూ? అలాగని, ఎన్ని చిరుతిళ్ళు తింటేమాత్రం అన్నం తినకుండా ఉండగలమా- అన్నారు. నిజమే అనిపించింది నాకు. సంఘానికీ, కట్టు బాట్లకీ వెరిచి గాని-అలా తిరిగితే తప్పేముంది-అనుకున్నాను. నన్ను ప్రేమించటం మానరనీ, నన్నొదిలి పెట్టరనీ నమ్మకం కుదిరిందినాకు. ఆయన మీద పరిపూర్ణ విశ్వాసం ఉంది నాకు...'

నువ్వూ అలా పది మంది మొగాళ్లతో పోతే ఊరుకుంటాడా అని అడుగుదామని తలెత్తాను. తనే చెప్పింది.

'నేనోసారి ఏడ్చిమొత్తుకున్నాను. ఇలా నచ్చిన ప్రతి ఆడదాని తోనూ పోతూంటే నాగతేం కాను? నాకు విలువ ఏం మిగిలింది—అని. వెంటనే ఆయన'కావాలంటేనువ్వూపో?నాకేం అభ్యంతరంలేదు' అన్నారు. 'ఛీ' అన్నాను. ఇద్దరం చెరొకదోవాపడితే ఇక సంసారం గట్టెక్కినట్టే. పోనీ, ఆయన జిహ్వని అణుచుకోలేక పోతే ఆయన్ని అనుభవించనీ— అని సమాధానపరుచుకున్నాను. నువ్వే చెప్పరమా—అంతకన్న నన్నేం చెయ్యమంటావ్? పైగా, 'నేనేం చేసినా నీతో చెప్పి చేస్తాను. నీ దగ్గర నాకు దాపరికం లేదు' అంటారు. చెబుతున్నారని సంతోషించ తగ్గ విష యమా ఇది?'

సుధవైపు వెర్రిదాన్లా, తెలివి తక్కువ దాన్లా చూశాను. అయితే తనకి నిన్న రాత్రి తెలుసు నన్నమాట? నా జీవితాన్ని నాశనం చేస్తున్నాడని తెలిసి కూడా ఊరుకుందన్నమాట. నువ్వు మహాపతివ్రతవే కావచ్చు. కానీ నువ్వు రాక్షసివి సుధా-అనుకున్నాను కచ్చితో. నా జీవితంతో చెలగాటం ఆడటానికి తనకేం హక్కుంది? నన్నటువంటి పరిస్థితిలో ఇరికించకుండా ఉండటానికి ప్రయత్నించకుండా ఉండకపోవడమే కాకుండా, తెలిసీ నాకు హెచ్చరిక చెయ్యకపోవటం—దీన్నేమంటారు? సుధని ఏమనాలో, ఏం చెయ్యాలో అర్థంకాలేదు. మనస్సు మాత్రం కచ్చితో కుత కుత లాడింది. సుధవైపు తీక్షణంగా చూస్తూ ఉండిపోయాను.

'ఎటువంటి పరిస్థితిలోనైనా ఆత్మరక్షణ చేసుకోగల శక్తి ఉండాలి రమా' అంది సుధ నాకు నీతి బోధిస్తున్నట్లుగా. అరక్షణం సేపు సుధని నమిలి మింగేద్దామా అన్నంత కోపం వచ్చింది. అంతలోనే సుధ మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించి మానసికంగా కూడా నన్ను నేను సమర్థించుకోలేకపోయాను. నా శారీరక బలహీనతను అంగీకార సూచకంగా అతను వినియోగించుకుంటే అందుకు బాధ్యులెవరు? పిల్లవాడు రోగిష్టి వాడైతే చిరుతిళ్లు చేతి కందుబాట్లో లేకుండా చేస్తుంది తల్లి. అందుబాటులో ఉంటే తీసుకు తినటం రోగిష్టి పిల్లవాడి లక్షణం. కానీ, సుధని ఏమన గలనిప్పుడు?

'కావాలని నిన్ను అన్యాయం చెయ్యాలనీ, నీకు ద్రోహం తలపెట్టాలనీ నిన్ను మా ఇంటికి రమ్మని బలవంత పెట్టలేదు రమా, నా బాల్యస్నేహితురాలివీ, ప్రాణస్నేహితురాలివీ అయిన నీ మీద ఒక్క పూటలో చొరవ తీసుకుంటారనుకోలేదు. అసలా అనుమానం కూడా రాలేదు నాకు. నిన్ను చూడగానే మా ఇంటికి తీసుకుపోవాలనీ, నీతో ముచ్చట్లు చెప్పు

కోవాలనీ తహ తహ లాడిపోయాను తప్ప. మరో విధమయిన ఆలోచనే రాలేదు నా మనస్సులోకి. నన్ను క్షమించు' అంది మళ్ళీ నా రెండు చేతులూ పట్టుకుని.

మళ్ళీ అదే తెలివి తక్కువ మాట. క్షమిస్తే తనకొరిగే దేమిటి, నా కొరిగేదేమిటి? క్షమించగానే జరిగిన దాన్ని మరిచి పోగలుగుతానా? మూర్తి మాటేమిటి?

మెయిలు ఖయ్యి మంది హఠాత్తుగా. నా ఒళ్లు జలదరించింది. నా మాటేమిటి అని నిలదీసినట్లు ముందుకొస్తున్న ఇంజన్ని చూస్తూ నిస్సహాయంగా నిలబడిపోయాను. నా సూట్‌కేసూ, చేతి సంచీ ఒక చేత్తో పట్టుకుని, మరో చేత్తో నా చెయ్యి పట్టుకుని ముందుకి నడిపించుకు వెళ్ళింది సుధ. కంపార్టుమెంటు దగ్గరలోనే కనిపించింది. లోపలికి మేము వెళ్ళే సరికి ఇద్దరు వృద్ధులూ. ఇద్దరు మధ్య వయస్సు వాళ్లూ కూర్చుని ఉన్నారు. 'కాలక్షేపానికి ఫరవా లేదు' అంది సుధ. నాకు మాత్రం చిరాకేసింది. కాస్సేపు ప్రశాంతంగా ఒక్కర్తెనీ కూర్చుని దీర్ఘంగా ఆలోచించుకో గలిగితే బావుండుననిపించింది. ఎప్పుడు వాల్తేరు వెళ్ళి బీచిలో కూర్చుందామా అనుకున్నాను. ఎప్పుడు రైలు కదుల్తుందా అనుకున్నాను

వచ్చే పోయే జనం హడావిడి చూస్తూ కూర్చున్నాం. మాకంపార్టుమెంటులో ఉన్న వృద్ధ దంపతుల్ని చూట్టానికి ఒకావిడ రెండేళ్ళ పిల్లాణ్ణి తీసుకుని వచ్చింది. ఆ పిల్లాడు భలే ముద్దొస్తున్నాడు, తల్లికూడా అందంగానూ చురుగ్గానూ ఉంది. ఆపిల్లాడు కొద్దిక్షణాల్లోనే అక్కడ ఉన్నవాళ్ళందరి దృష్టినీ ఆకర్షించాడు. సుధ చాక్‌లెట్లు కొని ఆ కుర్రాడి కిచ్చి వాణ్ణి దగ్గరికి తీసుకుంది. ఎన్నాళ్ళనుంచో ఎరుగునట్లు ఆకుర్రాడితో కబుర్లు చెబుతోంది, సుధకి పిల్లలంటే ఎంత పిచ్చి! పెళ్ళయి రెండు మూడేళ్లేగా అయింది! రెండు మూడేళ్ళకే రాజారావు ఎలాంటిపన్లు చేస్తున్నాడు!

సుధ ఎంత భ్రమ పడుతోంది! నిజమే పాపం, భ్రమ పడక పోతే తన బ్రతుకు దుర్భరమైపోదూ? అతన్ని దూరం చేసుకుంటేనూ అతని మీద ఏవగింపూ, కచ్చా పెంచుకుంటేనూ తన కొరిగేదేమిటి? ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. బ్రతుకుపైన మళ్ళీ మమకారం. ఉన్న దాన్నే వీలైనంత సుఖప్రదంగా చేసుకు బ్రతకాలనిపిస్తుంది. భర్తకి తన మీద ప్రేమ ఉందన్న భావమే సుధకి జీవనాధారం. సుధ అమాయకురాలూ, గడుసుదీనూ. సుధని చూస్తున్న కొద్దీ నాకు జాలి వేసింది, చిరాకు పుట్టింది.

గంట కొట్టారు స్టేషన్లో. పిల్లాడు ఉలిక్కిపడి తల్లి దగ్గరికి ఒక్క పరుగున పోయాడు. సుధ చిన్నబుచ్చుకుంది. అంతలోనే తేరుకుని, నాతో 'వెళ్ళొస్తాను రమా, ఆయన రానేలేదు....ఉత్తరాలు రాస్తూ ఉండు...నేను చచ్చిపోయాననుకోకు...' అంటూండే కళ్ళనీళ్ళు తిరిగాయి సుధకి. తనని ఓదార్చాల్సిన పరిస్థితికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. 'జాగ్రత్తగా వెళ్ళిరా ఇంటికి' అన్నాను. రైలు కదిలింది.

సుధ చెయ్యి ఊపుతోంది. స్టేషన్లో దూరంగా టిక్కెట్ కలెక్టరు నుంచున్న గేటుదగ్గర ఆజానుబాహు విగ్రహం కనిపించింది—రాజారావు అప్పుడే వచ్చినట్టున్నాడు. నిజంగా ఆలస్యం అయిందా? కావాలనే ఆలస్యంగా వచ్చాడా! కేవలం భార్యని ఇంటికి తీసుకుపోవడానికే వచ్చాడా? సుధ అన్నమాటలు నిజమేనా? సుధకి ఏ విధమైన ఇబ్బందీ కలక్కుండా చూసుకుంటాడు— కానీ చిరుతిళ్ళు కావాలి— అంతే: నన్నంత చులకనగా తీసుకున్న ఆ రాజారావుని చంపెయ్యాలనిపించింది— కానీ, దూరంగా గేటు దగ్గర నుంచుని ఉన్నాడు. రైలు ముందుకి పోతోంది. సుధ వెనక్కివెళ్ళి అతన్ని కలుసుకుంది. ఆతను సుధ నడుం చుట్టూ చెయ్యివేసి జాగ్రత్తగా గేటు దాటించి తీసుకువెళ్ళిపోయాడు. రైలు వేగంగా ముందుకి పోతోంది. అసహాయత నాగుండెల్ని పిండినట్లయింది. అటు

వంటి సమయాల్లోనే అదృష్టవంతులికి గుండె ఆగి పోతుందనుకుంటాను. రైలు ముందుకిపోతోంది. నేను ప్రయాణం చెయ్యాలి.

'ఏమమ్మా, అత్తారింటికా?' అంది ఎదురుగా కూర్చున్న ముసలావిడ. ఒళ్ళు మండింది, ఏమిటా సూటి ప్రశ్న అని. 'కాదండి' అన్నాను ముక్తసరిగా. ఆవిడ ఊరుకోలేదు.

'పుట్టింటి క్కామోసు' అంది. నవ్వొచ్చింది, 'కాదండి' అన్నాను, ఆవిణ్ణి ఏడిపించాలని బుద్ధి పుట్టి. ఆవిడ పట్టుదల మనిషిలా ఉంది.

"చదువుకోటానికా అమ్మా?"

ఘటికురాలేననుకున్నాను. అవునన్నాను చిరునవ్వుతో. ఆవిడ విజయగర్వంతో నా వైపు ఒక్కచూపు చూసి, మళ్ళీ భర్తతో ముచ్చట్లలో పడింది. పక్క బెర్తుమీద కూర్చున్న నడి వయసువాళ్లు నూతన వధూవరుల్లా ఒక్కళ్ళనొకళ్ళురాసుక్కూర్చుని తెగమాట్లాడుకుంటున్నారు. ఏం తోచక, పుస్తకం తీసి చదువుకుందామని సంచీ తెరిచాను. సంచీలో ఏదో పేకెట్ లాంటిది చేతికి తగిలింది. తీసివిప్పిచూశాను కొత్తచీర. తెల్లబోయాను. లోపల రవికగుడ్డ మీద ఒక ఉత్తరం పెట్టి ఉంది:

'రమా. నీతో ఎన్నో చెప్పాలని ఉంది. చెప్పగలుగుతానో లేదో, ఒక్కటి మాత్రం చెప్పనీ, నీకు కావాలని అన్యాయం తలపెట్టలేదు. ప్రాణ స్నేహితురాలివైన నీకు నా మూలంగా అన్యాయం జరిగింది. నన్ను క్షమించు—నీ సుధ'.

చింపి కిటికీలోంచి అవతలికి విసిరేశాను. ఆ ముక్కలు గాలిలో ఎగిరి పోతూంటే వరసగా మూర్తి, అమ్మ, నాన్నగారు, అక్క, బావ, తమ్ముడు, శేఖరం— అంతా కళ్ళ ముందు కదిలారు. తలొకరూ తలో మాటా అంటున్నారు- 'ఎంత పని చేశావే తల్లీ' అని అమ్మ కడుపు తరుక్కుపోయేలా ఏడుస్తోంది. 'ఛీ, నా కడుపున చెడబుట్టింది' అని నాన్న

గారు చీదరించుకుంటున్నారు. 'అక్కా, మా స్కూల్లో అందరికీ నీ సంగతి తెలిసిపోయింది. వాళ్ళకి నా మొహం ఎలా చూపించను?' అంటూ తమ్ముడు వాపోతున్నాడు. 'నేను చెబితే విన్నావా? మరీ అంత విచ్చలవిడిగా మొగాళ్లతో తిరగొద్దే అంటేనూ. ఇరవై ఏళ్ల నెత్తిమీది కొచ్చి ఆ మాత్రం జ్ఞానం లేకపోతే ఎలా' అంటోంది అక్కయ్య. 'పండక్కి వచ్చినప్పుడు పేకాటలో నా చెయ్యి కావాలని తగిల్చానని గింజుకున్నావు కదా? ఇప్పుడేమైంది?' అంటూ బావ ఎగతాళి చేస్తున్నాడు. 'నాకు తెలుసు నువ్వు అలాంటి దెబ్బ తింటావని. అందుకే నువ్వు కాదన్నా నేను బాధపడలేదు' అంటున్నాడు శేఖరం. 'రమా నువ్వు నా దానివి, నువ్వు ఎలాంటి దానివైనా నాకు ఇబ్బంది లేదు. నీ హృదయం నిష్కల్మషమైనది. నువ్వు నాక్కావాలి రా, నా దగ్గరికి రా' అంటున్నాడు మూర్తి. అంతలోనే మళ్ళీ 'ఛీ, నీ శరీరం పాడు పడింది. ఇది నాది కాదు. ఇలాంటిది నాకొద్దు' అంటున్నాడు మూర్తి.

ఉత్తరం ముక్కలు గాలిలో ఎగురుతూ పైపైకి పోతున్నాయి. అంతులేని ఆకారం లేని ఆలోచనలు పైకి రాలేక తలదిమ్మెత్తి పోయింది. పుండు మీద ముసిరే ఈగల్లాంటి ఆలోచనల్నించి తప్పించుకోవడానికి పుస్తకం తెరిచాను. పరీక్షల గురించి ఆలోచన కొంత ప్రశాంతతని కలుగ జేసింది కానీ అదీ కుక్కతోక తంతే అయింది. కాస్సేపటికి మళ్ళీ విరక్తి.

ఎందుకీ పరీక్షలు? అసలు పరీక్షలో నెగ్గలేక పోయిన తర్వాత! నేను చదివిన చదువు ఎందుక్కొరగాను? పెద్దచదువుల్లేకపోయినా అమ్మ, అక్కయ్య నీతిగానూ. ప్రశాంతంగానూ బ్రతకడం లేదూ? నా కెందుకీ అవస్థ, నేనేం పాపం చేశానని? నన్నెందుకిలా పుట్టించాడు?

హఠాత్తుగా స్వాములవారు గుర్తు కొచ్చారు. ఆయన అనుసరించే మార్గం ఎంత ఉత్తమ మయినది! ఈ నీచ వాతావరణానికి దూరంగా భగవత్సాన్నిధ్యంలో సర్వపరిత్యాగం చేసి తపస్సు చెయ్యటం ఎంత ఉత్తమమయిన కార్యం! ఈ అనుబంధాలూ ప్రేమలూ మోహాలూ మనుషుల్ని అధమాధమ స్థితికి దిగజార్చటానికి తప్ప మరెందుకూ ఉపయోగించవు. ఆనందాన్నిస్తామని ఆశ పెట్టి అశాంతికి గురిచేస్తాయి. ఆత్మ వికాసానికి తోడ్పడేందుకు బదులు స్వార్థ చింతనానికి పురికొల్పుతాయి. ఈ అస్వతంత్రత, ఈ మమకారం పురోగతికి బంధనాలు. శ్లేష్మంలో పడ్డ ఈగలాగ ఈ బంధనాల్లో చిక్కుకుని పరితాప పడే కన్న వీటికి దూరంగా పోయి స్వార్థపుటాలోచనలకు తావులేని చోట దైవాన్ని గురించి యోచించటం ఉత్తమం. ఇంతకు ముందే నాకెందుకు తోచలేదు ఈ మార్గం? అమ్మకీ నాన్నగారికీ అక్కకీ తమ్ముడికీ పిన్నికీ బాబయ్యకీ మూర్తికీ శేఖరానికీ సుధకీ రాజారావుకీ— వీళ్ళందరికీ దూరంగా పోవాలి. 'నా' గురించి నేను ఆలోచించుకోవటం మానగలిగి నప్పుడుగాని పరిపూర్ణమయిన శాంతి లభ్యం కాదు. ఈ బంధువులూ స్నేహితులూ శత్రువులూ నన్ను ఆవరించినంత కాలం 'నా' గురించిన ఆలోచనలు నా చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంటాయి. నా పూర్వానుభూతుల్ని మరిచిపోవాలి. బంధనాలు లేని, సరిహద్దులు లేని ఒక వినూత్న జీవితాన్ని ప్రారంభించాలి. అప్పుడు నాకు సమస్యలంటూ ఏవీ ఉండవు— ఇప్పుడు నన్నెదుర్కొంటున్న చదువు, సంస్కారం, ప్రేమ, మోహం, ఇవేమీ నాకు సమస్యలు కావు. సమస్యలు లేకుండా చేసుకోవాలంటే నాపూర్వాన్ని సమస్తాన్నీ మరచిపోవాలి. పూర్వాన్ని మరచిపోవాలంటే బంధనాన్ని తెంపుకోవాలి. దూరంగా పోవాలి. అవును అదొక్కటే మార్గం.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను— నా సమస్యాపరిష్కారానికి మార్గం కనిపెట్టినందుకు. పుస్తకం సంచీలో పెట్టేశాను. మానసికంగా అన్వేషించిన నూతన మార్గానికి నిజ స్వరూపాన్ని ఎలా ఇవ్వాలో ఆలోచిస్తూ కూర్చున్నాను. ఎప్పుడో కునుకు పట్టింది.

రైలు కూతకి నిద్ర మెలుకు వొచ్చింది. తీరా చూస్తే వాల్తేరు వచ్చేసింది అప్పుడే. వ్యక్తావ్యక్తాల మధ్య ఊగిస లాడుతున్న నా నిర్ణయాని కొక రూపాన్ని ఆపాదించకముందే పరిస్థితుల ప్రోద్బలం ఉధృత మయింది. స్టేషనుకి పిన్ని, బాబయ్య వచ్చేశారు. నా ప్రమేయం లేకుండానే నా సామాను తీసుకొనినన్ను రైల్లోంచి దింపారు. అనంతంగా సాగిపోదామనుకున్న నా ప్రయాణం అప్పటితో ఆగిపోయింది. అంత మాత్రాన నా మనస్సు చలించలేదు. నిర్ణయం సడలిపోలేదు. తరుణం మించిపోలేదు. భావోద్వేగానికి లొంగిపోయే మానసిక దౌర్బల్యాన్ని జయించాను. నిమిత్త మాత్రంగా నడిచి వెళ్లాను-పిన్నితోనూ బాబయ్యతోనూ కలిసి.

హఠాత్తుగా స్ఫురించింది—వీళ్లస్టేషనుకి ఎలా వచ్చారా అని.

'నేనివ్వాళ వస్తున్నట్లు ఎలా తెలిసింది'?

'పొద్దున్నే మీ నాన్న ఇచ్చిన టెలిగ్రాం అందింది. వెంటనే బయలుదేరి వచ్చాం' అన్నాడు బాబయ్య. నవ్వొచ్చింది.

'టెలిగ్రాం ఇవ్వాళ అందటమేమిటి? అసలు నేను నిన్ననే రావల్సింది. మధ్యలో రాజమండ్రిలో ఓ పూట ఆగాను'.

పిన్ని బుగ్గలు నొక్కుకుంది.

'నిన్న ఎలాగూరాలేదు కదా నువ్వు. టెలిగ్రాంలో తారీఖు తప్పయి ఉంటుందని ఊహించి బయల్దేరాం' అన్నాడు బాబయ్య.

జట్కా బండిలో కూర్చున్నాక పిన్ని ఉత్సాహంగా అడిగింది 'తాంబూలాలు పుచ్చుకున్నారుటే'?

లేదన్నాను. తెల్లబోయి చూశారిద్దరూ.

'ఏం, కట్నం దగ్గర పేచీ వచ్చిందా?' అన్నాడు బాబయ్య.

'అబ్బే, వాళ్లు అసలు అడిగినట్లులేదు'.

'మరెందువల్లనే? కొంపతీసి అతని మనస్సు మారలేదు కదా' అంది పిన్ని ఆదుర్దాగా.

'ఊహు, నేనే వద్దన్నాను'. పిన్ని నా మాటల్ని నమ్మినట్లు లేదు. మళ్ళీ రెట్టించి అడిగింది. అవునని బుర్ర ఊపాను, జట్కా బండికి బుర్ర తక్కుమని కొట్టుకుంది. తల తడుముకోలేదు. కొంతసేపు ఎవరం మాట్లాడ లేదు.

'పరీక్షలయ్యే వరకూ తాంబూలాలు పుచ్చుకోవటం ఎందుకనా?' అని పిన్ని మళ్ళీ అడిగింది. ఈసారి మరింత స్పష్టంగా చెప్పాను— శేఖరాన్ని చేసుకోవటానికి నేనసలు ఇష్టపడలేదని.

'అమ్మ, నాన్నగారూ ఏమన్నారు?' బాబయ్య అడిగాడు. చెప్పాను_ అమ్మ కాస్సేపు ఏడ్చిందనీ, నాన్నగారు కొంతసేపు కస్సుబుస్సు మన్నా రనీను.

నా ధోరణి మొండితనంలా కనిపించి ఉంటుంది వాళ్లకి, ఇంటికి వెళ్ళే వరకూ ఇంకేమీ మాట్లాడలేదు, నేను పట్టించుకోలేదు.

పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నాను. తలుపుతట్టిన చప్పుడైంది. లేచి వెళ్ళి తలుపు తీశాను. రాధ లోపలికొచ్చి కూర్చుంటూ 'విశేషా లేమిటి? అంది.

'ఏమున్నాయ్ 'అంటూ చతికిల బడ్డాను.

'హఠాత్తుగా పరీక్షల ముందు వెళ్ళా వెందుకు? మీ అమ్మగారూ నాన్నగారూ కులాసాయేనా?'

... ... ... —

'మరెందుకు పిలిచారు? పెళ్ళిసంబంధమా? చిలిపిగా నవ్వుతూ అంది.

అవునన్నట్లు తల ఊపాను.

'మరేం అంత నంగనాచిలా మొహం పెట్టావ్!' అంది బుగ్గమీద పొడుస్తూ,

ఆ చిలిపి తనానికి చిరా కేసింది. నా కనుబొమలు ముడుచుకున్న ట్లున్నాయి.

'సారీ, కుదర్లేదా? అంది జాలిగా చూస్తూ.

'అంత విచార పడక్కర్లేదు, నేనే ఒప్పుకో లేదు.'

రాధ చిరునవ్వు నవ్వింది-నాకు తెలుసులే, నువ్వెందు కొప్పుకో లే దో-అన్నట్లుగా ఉంది ఆ నవ్వు. పొరపాటు పడుతోందనుకున్నాను.

'ఏం, నవ్వుతున్నావ్?' ఏమీ ఎరగనట్లు అడిగాను.

'నువ్వెళ్ళాక మూర్తిగారు ఒక్కక్లాసు కూడా తీసుకోలేదు తెలుసా? ఏదో వంకపెట్టి తప్పించు కున్నారు' అంటూ నవ్వింది, ఆనవ్వులో నేను పాలు పంచుకోలేదు. తనే మళ్ళీ చెప్పింది.

'నిన్న లైబ్రరీలో కలిసి నప్పుడు నీ గురించి అడిగారు-ఎప్పు డొస్తున్నావని. ఇవాళో రేపో రావచ్చునన్నాను. ఆయన ఆనందాన్ని ఎంత దాచుకున్నా దాగలేదు."

మరొకప్పుడైతే ఆ మాటలు వింటూ లోలోపల సంతోషంతోనూ సిగ్గుతోనూ ఉక్కిరిబిక్కిరయేదాన్ని. కానీ, ఇప్పుడు— ఎవరిగురించో వింటున్నట్లుగా ఏ విధమయిన భావోద్వేగమూ లేకుండా వినగలిగాను. రాధ ఈ పరిణామాన్ని అంత శ్రద్ధగా పరిశీలించినట్టు లేదు లైబ్రరీకి పోదాం రమ్మని పట్టుపట్టింది. ఇప్పుడు ఓపికలేదు, రాలేనని తప్పించుకుందామన్నా వొదల్లేదు. చెప్పులు తొడుక్కుని బయలుదేరాను.

"పిన్నీ, ఓ మారు అలా వెళ్లొస్తా" అని కేకేశాను. పిన్ని వంటింట్లోంచి చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది,

"చీర మార్చుకోవుటే" అంది. ఫరవాలేదన్నాను.

'కాస్త కాఫీ తాగి వెళ్ళవమ్మా రాధా',

'అబ్బే, ఇప్పుడేం వద్దండీ' అంటూ బయటికి దారి తీసింది రాధ.

లైబ్రరీలో కేటలాగులో పుస్తకాల వివరాలు చూస్తోంది రాధ. నేను లోపలికి వెళ్ళాను. పరీక్షలకోసం చదువుదామనే ధోరణి పోయింది. ఇటూ అటూ అన్ని షెల్ఫుల దగ్గరికీ వెళ్ళాను. ఏ పుస్తకమూ నాకంటిని ఆకర్షించలేదు. ఎదురుగా వేదాంత గ్రంథాలూ మతగ్రంథాలు వరసగా కనిపించాయి. వరసగా చూస్తూ పోయాను. ఒకచోట ఆగిపోయి మరింత పరీక్షగా పేర్లు చదివాను. ఆఖరి వరసలో రామకృష్ణ పరమహంసపై గ్రంథాలు కనిపించాయి. అందులో ఒక పుస్తకం నన్నమితంగా ఆకర్షించింది. రామకృష్ణ పరమహంస అనేక విషయాలపై అప్పుడప్పుడూ వ్యక్తం చేసిన భావాల సంపుటీకరణం అది. నా జ్ఞాన తృష్ణని తీర్చగలదన్న ఆశతో ఆ పుస్తకం తీసుకున్నాను. పుస్తకం ఇవతలికి లాగేసరికి దాని వెనక భాగంలో మరో పుస్తకం అడ్డంగా కనిపించింది. కుతూహ

లంతో తీసి చూశాను. 'లాస్కీ' పుస్తకం. ఆశ్చర్యం వేసింది. ఉత్సాహంగా తీసికెళ్ళి రాధకి చూపించాను.

'ఎక్కడ దొరికిందీ' అంది ఒక్కగెంతు గెంతి! ఫిలాసఫీ సెక్షన్లో దొరికిందన్నాను. నవ్వుతూ చెప్పింది-

'ఆమధ్య నేనే దాచానక్కడ, ఆ టైముకి నాదగ్గర టిక్కెట్టులేదు. తీరా కావాలనుకున్నప్పుడు దొరకదేమోనని' 'కౌటిల్యుడు' చదవడం అయిపోగానే 'లాస్కీ' తీసుకుందామనుకునేసరికి- ఎక్కడ దాచానో మరిచిపోయాను. చస్తున్నాను రోజూ వెతకలేక.'

'ఇంకెప్పుడూ ఇలాంటి చిలిపి పనులు చెయ్యకు' అని రాధ వీపు మీద ఒక్కటి చరిచాను. నా చేతిలో పుస్తకం ఏమిటని చూసింది. 'రామ కృష్ణ పరమహంస' అని చూసి ఆశ్చర్యపోయింది. బాబయ్య కోసం తీసుకున్నానని చెప్పాను-రాధ అడగబోయే ప్రశ్నల్ని తప్పించుకుందామని.

ఇద్దరం పుస్తకాలు తీసుకుని బయటకు వస్తూంటే సుమతీ, రాఘవరావూ కలిశారు. కాంటీన్‌కి రమ్మన్నారు. వాళ్ళతో వెళ్ళబుద్ధి కాలేదు. నేను ఇదివరకటి రమని కాదు. నాలో కలిగిన మార్పుకి వీలైనంత దోహదం చెయ్యాలనే ప్రయత్నిస్తున్నాను. నాకున్న అనుభవం వాళ్ళకి లేదు. నాక్కలిగిన జ్ఞానోదయం వాళ్ళక్కలేదు. వాళ్ళింకా చిన్నవాళ్ళు అన్నివిధాలా. వాళ్ళు ఎంత దూరంలో ఉంటే నా పురోగతికి అంత మంచిది. నాకు వేరే పనుందని గట్టిగా చెప్పి వాళ్ళ నొదిలించుకుని వచ్చేశాను.

తల వంచుకుని గబగబా నడిచి గేటువైపు వెడుతున్నాను.

'ఏయ్! ఏమిటా పరుగు!'

తలెత్తి చూశాను. మూర్తి! సాయంకాలపు నీరెండ మొహాన పడుతూంటే మూర్తి మొహం తేజస్సు ఉట్టిపడుతున్నట్లు కనిపించింది. విశాలమయిన నుదురు, పొడుగ్గా ముక్కు, తీర్చిదిద్దినట్లున్న చెంపలు-తెలివితేటలు ప్రస్ఫుటించే అందం-కొత్తగా చూస్తున్నట్లు చూశాను.

'నీ కోసమే వస్తున్నాను, పద, బీచికి పోదాం, తీరిగ్గా చూద్దుగాని నా మొహాన్ని' అన్నాడు నా చెయ్యి పట్టుకుని. అతని సాన్నిధ్యంలో గతాన్ని హఠాత్తుగా విస్మరించిన నా బుద్ధిహీనతకు లోలోపల తిట్టుకున్నాను. బీచివైపు దోవతీశాడు. పక్కనే నడక సాగించాను.

రాధ అడిగిన ప్రశ్నలే అడిగాడు, ఎందుకంత హఠాత్తుగా హైదరాబాదు వెళ్లానని, అమ్మ, నాన్న కులాసాగా ఉన్నారా అనీను. పెళ్ళి ప్రయత్నం గురించి చెప్పాను. 'శేఖరం స్కాలర్‌షిప్‌తో అమెరికా వెళ్ళబోతున్నాడు. అతను వెళ్ళే లోపలే మాపెళ్ళి చెయ్యాలనుకున్నారు అంతాను'.

చటుక్కున నడక ఆపేసి నావంక తీక్షణంగా చూశాడు మూర్తి. నేనేం చెబుతానోనని అతను కంగారు పడుతున్నట్టుగా ఉఛ్ఛ్వాస నిశ్వాసాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

నాకోసం మూర్తి ఎంత ఆశ పడుతున్నాడు! ఎంత ప్రేమ అతనికి! క్షణం సేపు నా మనస్సు దుర్బలమై పోయింది. అతని గుండెల్ని గట్టిగా అదిమి పట్టుకుని 'నేను నీదాన్ని, నేను నీదాన్ని' అని చెప్పకోవా లనిపించింది. ఆవేశాన్ని అణుచుకున్నాను.

'నేను ఒప్పుకోలేదు' అన్నాను నిశ్చలంగా అతని వైపు చూస్తూ. మూర్తి వెంటనే నన్ను బలంగా దగ్గరికి లాక్కున్నాడు. కాళ్ళ కింద ఇసుక తప్పుకున్నట్లయి, బలమైన అతని బాహువుల్లో ఇరుక్కుపోయాను. మూర్తి ఊపిరి వెచ్చగా నా మొహాన్ని కప్పేసింది. ఆ ఊపిరిలో రాజారావు రూపం కదలాడింది—గుచ్చుకుంటూన్న గడ్డం, ఘాటైన చుట్ట వాసన- మైకం కమ్మినట్లయింది. చేతిలోంచి రామకృష్ణుని పుస్తకం జారికింద పడిపోయింది. తెలివి తెచ్చుకుని బంధనం వొదిలించుకుని రెండడుగులు వెనక్కివేశాను. మూర్తి మొహం చిన్నబోయింది. రాజారావు జ్ఞాపకాన్ని లోపలికి అణచివేసి పైకి ఓ చిరునవ్వునవ్వాను. ధైర్యం వచ్చి మూర్తి తేలిగ్గా నవ్వేస్తూ చురుగ్గా నడక సాగించాడు. ఇంకా ఎన్నో చెప్పాలి మూర్తికి—అనుకున్నాను. ఇసుకలో కాళ్లు కూరుకుపోతున్నాయి. ఈడ్చుకుంటూ నడుస్తున్నాను.

అలవాటు ప్రకారం తరంగాలను చూస్తూ ఎదురెదురుగా కూర్చున్నాం. మూర్తి మరింత ముందుకొచ్చాడు. అతని పాదాల మీద నా పాదాల్ని పెట్టి పైన ఇసుకను గుప్పెళ్లతో పోస్తున్నాడు. ఇదివరకు నేనూ పోసేదాన్ని. 'మన సంసారనౌక నడవటాని కిలాగే ఇద్దరం చెరో చెయ్యీ వెయ్యాలి రమా' అనే వాడు. ఇప్పుడు నేను చేతులు ఒళ్లో పెట్టుక్కూర్చున్నాను. మూర్తి నా వంకా, తరంగాల వంకా చూస్తూ గుప్పెళ్లతో ఇసుక పోస్తున్నాడు పాదాల మీద. గోపురం తయారు చేస్తున్నాడు.

'ఇంకా చెప్పు నీ పెళ్ళి ముచ్చట్లు' అన్నాడు చిలిపిగా నవ్వుతూ. ఇప్పుడతనికి నమ్మకం కుదిరినట్టుంది—నేను తనదాన్నేనని. 'ఇప్పుడు నా మనస్సు మారిపోయింది. నేను ఎవరి దాన్నీకాదు' అని చెబితే మూర్తి ఏమంటాడు? ఉత్సాహంతో ఉరకలువేస్తున్న అతని ఆశలు సముద్ర

తరంగాల్లాగే రూపురేఖల్లేకుండా చెల్లాచెదరైపోతాయి. మనస్సు గాయపడుతుంది. అయినా చెప్పక తప్పదు. పునాదిలేని భవనానికి ప్రతిష్ఠత ఉండదు. గోపురం తయారైంది. దాన్ని నునుపుచేస్తున్నాడు—అవి నా బుగ్గలేనన్నంత సున్నితంగా స్పృశిస్తున్నాడు గోపురం పక్కల్ని. తరువాత మెల్లిగా గోపురం శిఖరం దాకా వచ్చాడు. శిఖరం మరింత మొన తేలేటట్లు చెయ్యటానికి. ఇంక చెప్పెయ్యాలి. కంఠతాపట్టి అప్పచెప్పినట్లు గుక్క తిప్పుకోకుండా అన్నాను.

'మూర్తీ, నేను పెళ్ళి చేసుకోదలుచుకోలేదు. నన్ను మరిచిపో.'

గోపురం అడుగున మూర్తి పాదాలు విద్యుచ్ఛక్తి సోకినట్లుగా హఠాత్తుగా వెనక్కి లాక్కున్నాయి. గోపురం జవజవలాడుతూ కిందికి కూలింది. కూలిన ఇసుకగోపురం కింద నా పాదాలు ఇంకా అలాగే ఉన్నాయి. అంతలోనే సర్దుకున్నట్టుగా 'అయ్యో పడిపోయింది' అంటూ ఇసుక పోగుచెయ్యబోయాడు. పాదాలు వెనక్కి లాగేసుకున్నాను. ముడుచుకుని మోకాళ్లమీద గడ్డం ఆన్చి కూర్చున్నాను.

నీరెండపోయి చీకట్లు అలుముకుంటున్నాయి. మూర్తి మొహంలో కూడా కాంతిపోయి వాడిపోయి ఉంది. ఇసుకలోంచి గులకరాళ్ళూ నత్తగుల్లలూ ఏరి పారేస్తున్నాడు. ఒకే పరిమాణంలో ఉన్న స్వచ్ఛమైన ఇసుకరేణువుల్ని పోగుచేస్తున్నాడు. చెడుని ఏమాత్రం స్వీకరించకుండా మంచిని మాత్రమే స్వీకరించడానికి ప్రయత్నించే మూర్తి స్థిరచిత్తం ముందు చిరుగాలి తాకిడికే తన ఉనికిని కోల్పోయే ఎండుటాకులా కనిపించింది నా మనస్సు. రాజారావు సంగతి ఇప్పుడతనికి చెబితే నిర్మలమైన నీటిలో రాయి విసిరినట్లే అవుతుంది. అతనిలో అటువంటి అలజడి

రేగించటం అనవసరం. కొమ్మకొమ్మనీ కొట్టి చిత్రవధ చేసేకన్న చెట్టుని మొదలంటా నరకటం ఉత్తమం.

'ఏం రమా, ఎందుకు చేసుకోవు? పెళ్ళెందుకు మానుకుంటావ్? ఏం జరిగింది?' ఆవేశ పూరితుడయాడు.

'నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు. అంతే' అన్నాను దృఢంగా.

'ఏదీ, నామొహంచూసి చెప్పు. నేను నీకక్కర్లేదా?....మాట్లాడవేం? నామీద ఇంతరోత ఎందుకు పుట్టింది? నేనేం చేశానని?' నాచేతులు పట్టుకు ఊపేస్తున్నాడు.

'నువ్వేమీ చెయ్యలేదు మూర్తీ' అన్నాను శాంతంగా.

'మరయితే చెప్పు. నన్నెందుకు దూరం చేసుకోదలిచావో చెప్పు'

'నిన్నేకాదు, ఈ లోకాన్నేవిడిచి దూరంగా పోవాలనుకుంటు-న్నాను'.

'ఏం, ఎందుకంత విరక్తి?'

నేను మాట్లాళేదు.

'మీ నాన్నగారు తెచ్చిన సంబంధాన్ని కాదనే ధైర్యం నీకు లేకపోతే నేను వెళ్ళి ఒప్పిస్తాను ఆయన్ని. వాళ్ళు ఒప్పుకోకపోయినా నువ్వు నన్ను నమ్ముకుంటే నీకు ఎటువంటి ఆపదా రాదు. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. నీ కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. నాకు మాత్రం దూరం కావద్దు రమా'.

'అది కాదు మూర్తీ, అమ్మావాళ్ళూ అభ్యంతరం చెప్పారని నేను వెనుకంజ వెయ్యడం లేదు. నీ మీద విశ్వాసం లేకనూకాదు. నా కసలు పెళ్లిమీదే ధ్యాసలేదిప్పుడు. ఇందులో నాన్నగారి ప్రమేయంగాని నీ ప్రమేయంగాని ఏమీలేదు.'

'పెళ్లి చేసుకోకుండా అలా ఉండిపోదామనా? ఎన్నాళ్లుంటావ్? ఎలా ఉంటావ్?' బిత్తరపోతూ అడిగాడు. ఆ ప్రశ్న ఒక సవాలులా వినిపించింది. వెంటనే పౌరుషం వచ్చింది నాకు.

'ఏం, ఎందుకుండలేను? ఉండదలుచుకుంటే తప్పకుండా ఉండగల్ను'.

'ఏం, ఎందుకుండాలనుకోవాలి? నువ్వు ఆడదానివి కావా? మామూలు మనిషివి కావా? వయస్సులో ఉన్నప్పుడు పురుషసంపర్కాన్ని కోరటం ఎవరికైనా సహజం కాదా? ఆ కోర్కె నీలో లేదా? ఉంటే చంపుకోవాలనుకుంటున్నావా? దేనికోసం ఆ ప్రయత్నం?' అన్నాడు మూర్తి ఉద్రేకపడుతూ.

'స్త్రీ పురుష సంబంధం అనివార్యం అని నేననుకోను. ఆనందంగా జీవించదలుచుకుంటే అనేక మార్గాలున్నాయి—వివాహం ఒక్కటేకాదు'.

'అయితే, నాతో స్నేహం చెయ్యటం, నన్ను ప్రేమించాననటం—ఇవన్నీ ఎందుకు చేసినట్లు?' కోపంతో మూర్తి గొంతు కొంచెం ఒణికింది. అతను ఉద్రేకపడుతున్నాడు. ఈ సమయంలో అతనికేం చెప్పినా సమంజసంగా తోచదు. నెమ్మదిమీద నచ్చచెప్పాలి— అనుకుని 'లే, మూర్తీ, చీకటిపడిపోతోంది.' అంటూ లేచి చీరమీంచి ఇసుక దులుపుకున్నాను.

మూర్తి లేచి నా భుజాల్ని కుడిచేత్తో పట్టుకుని 'పిచ్చిపిల్లా, అనవసరంగా మనసు పాడుచేసుకుని పిచ్చిపిచ్చిగా ఆలోచించకు' అన్నాడు.

'ఏమిటీతను!' అనుకుంటూ నిర్ఘాంతపోయి అతని మొహంలోకి చూశాను. గబుక్కున వొంగి నా నుదుటిమీద చెంప ఆన్చాడు. నా పెదిమలు అతని మెడకి తగిలాయి. వెంటనే రెండో చేతిని కూడా నా చుట్టూ బంధించాడు. 'మూర్తి కావాలి' అంటూ మళ్ళీ నా హృదయం మూలిగింది. రాజారావు మనస్సులో మెదిలాడు వెనువెంటనే. స్వచ్ఛమయిన పాలు తాగుదామని గ్లాసు నోటిదాకా తెచ్చుకున్నాక అందులో ఈగ పడినట్లుగా—మూర్తి హృదయానికి చేరువవుతున్న ప్రతి క్షణంలోనూ 'రాజారావు జ్ఞాపకం' మనస్సుని కల్మషం చేస్తోంది. మూర్తిని వివాహం చేసుకుని నిర్మలమైన ప్రేమానుభూతిని పొందలేనని మరింత స్పష్టమైంది. మూర్తికి ఎలాగైనా దూరం కావాలి. అతన్ని అన్యాయం చెయ్యకూడదు-అని నిశ్చయించు కున్నాను. మూర్తిపైన నాకున్న 'ప్రేమ' అనే బలహీనతని రూపురేఖ లేకుండా చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

మెల్లిగా నడుచుకుంటూ ముందుకి పోయాం. మెట్టమీదికి వచ్చేసరికి చటుక్కున గుర్తుకొచ్చింది స్వాములవారి ప్రసంగం విషయం. అయ్యో! ఆయన కలకత్తా వెళిపోయారేమో అనుకున్నాను.

'ఇటు ఎక్కడికి?' పరధ్యానంలో నడుస్తున్నాననుకుని మూర్తి హెచ్చరించాడు.

'రామకృష్ణా మిషన్‌కి' అన్నాను. అతను పకపకా నవ్వేశాడు. 'ఏం అంతగురి ఎప్పుడు కుదిరింది అమ్మగారికి! పరీక్షల వైరాగ్యమా!'

'ఛీ' అని, రెండడుగులు ముందుకి వేశాను. అమాంతం నా చెయ్యి గట్టిగా పట్టుకుని కుడివైపుకి లాక్కువెళ్లాడు.

'నీ గాంభీర్యం చూస్తే కొంపతీసి నిజంగానే మఠంలోకి వెళిపోతావని భయం వేసింద' అన్నాడు ప్రమాదంనుంచి తప్పించుకున్నట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ. మా ఇంటి దరిదాపులికి వచ్చేవరకూ నా చెయ్యి వదల్లేదు మూర్తి.

మర్నాడు పొద్దున్న పదిగంటలకి రెండు పుస్తకాలు చేత బుచ్చుకుని బయలుదేరాను. లైబ్రరీకి అనుకుని పిన్ని ఏమీ అడగలేదు. తిన్నగా రామకృష్ణామిషన్‌కి వెళ్లాను. లోపలికి వెళ్ళగానే ఎవరికోసమని అడగాలి, ఏమని చెప్పాలి అని సంశయిస్తూండగానే ఎదురుగా రైల్లో కనిపించిన స్వాములవారు కనిపించారు. నన్ను చూడగానే ఎంతో ఆదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టారు. ఎదురుగా ఆయన కూర్చున్నారు.

'మీరింకా కలకత్తా వెళ్ళకపోవటం నా అదృష్టం. కానీ, మీ ప్రసంగాన్ని మాత్రం వినలేకపోయాను.'

'కారణాంతరాలవల్ల నా ప్రయాణం ఇవాల్టివరకూ వాయిదా పడిందమ్మా. నిన్ను మళ్ళీ చూడగలగటం నాకు సంతోషదాయకంగా ఉంది. చదువు ఎట్లా సాగుతున్నది తల్లీ?'

'మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడదామని వచ్చానండి. మీకిప్పుడు అభ్యంతరం ఏమైనా ఉంటే చెప్పండి. ఎప్పుడొచ్చి కలవమన్నా కలుస్తాను.'

'చెప్పమ్మా, ఏం మాట్లాడా లనుకున్నావు? నేను నీకు చేయగలిగిన సేవ ఏమైనా ఉంటే చెప్పుతల్లీ.'

ఇంత ఉత్తముడైన మనిషిని మరెక్కడా చూడలేదనిపించింది.

'నేను కూడా మీ మార్గాన్నే అనుసరించటానికి నిశ్చయించుకున్నాను గురువుగారూ. నాకీ జీవితం మీద విరక్తి పుట్టింది'

అన్నాను ఆయన కన్నుల్లోకి చూస్తూ. స్వాములవారు చిరునవ్వునవ్వి "ఇంత పిన్నవయస్సులో నీకు వైరాగ్య భావాలు కలగటానికి కారణా లేమిటమ్మా?' అన్నారు. సమాధానం తక్కున చెప్పలేక తలవంచు కున్నాను.

'పరిష్కరించలేని సమస్యలు ఎదురైనప్పుడు అసహాయంగా దేవుడి వైపు మొగ్గుతాడు మానవుడు. కానీ దేవుడి మౌనం అర్థంకాదు. దేవుణ్ణి అర్థం చేసుకోవాలంటే మానవుడు తన్నుతాను అర్థం చేసుకోగలగాలి. నిన్ను నీవు అర్థం చేసుకుంటే నీ చుట్టూ పరివేష్టించి ఉన్న సమస్యలు వాటంతటవే పరిష్కృత మవుతాయి. సమస్యాపరిష్కారానికి మార్గం సమస్యల నుంచి దూరంగా పారిపోవటం కాదు. సమస్యల్ని సృష్టించు కోకపోవటమే మార్గం. ఒక సమస్య నుంచి నువ్వు పారిపోతే మరొక సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్యలన్నీ నీ మనస్సులో పుట్టినవే. నీ మనస్సుని నువ్వు విపులంగా అర్థం చేసుకున్ననాడు నీకు మనశ్శాంతి లభిస్తుంది.'

ఆయన ధోరణి నాకు అర్థంకాలేదు. నా అజ్ఞానాన్ని దాచుకోలేదు.

'ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు? కొన్ని జ్ఞాపకాలు నన్ను చిత్ర వధ చేస్తున్నాయి. ఈ జ్ఞాపకాల వలలో చిక్కుకున్న నేను చేయగలిగిం దేమిటి? ఈ బంధనంలోంచి ఎలా బయటపడగలను? మీరే చెప్పండి' అన్నాను అశాంతి రేగుతూండగా.

జ్ఞాపకాలు చాలా హానికరమైనవమ్మా. గతించిపోయిన వాటిగురించీ, జరిగిపోయిన సంఘటనల గురించీ జ్ఞాపకాలు నిన్ను వర్తమానం నుంచి దూరం చేస్తాయి. వర్తమానానికి తగిన ప్రాముఖ్యాన్ని ఇవ్వకుండా నీలోని శక్తినంతటినీ పుంజుకుని తాము సజీవమూ శక్తిసంపన్నమూ

అవుతాయి. గతించిన సంఘటనల గురించి తదేకంగా ఆలోచించటం ద్వారా నీ ప్రస్తుత కర్తవ్యాలను విస్మరిస్తున్నావు. ఈ విస్మరణ మరి కొన్ని అవాంఛితమైన సంఘటనలకు దారి తీస్తుంది. ఆ సంఘటనలు మళ్ళీ గతానికి చెంది పోతాయి. వాటి జ్ఞాపకాలు మరికొన్ని నిన్ను స్వాధీనం చేసుకుంటాయి. ఈ జ్ఞాపకాలు అన్నీ నీ మెదడు తయారు చేసుకుంటున్నవే. అంతటికీ మూలకారణం నీ మనస్సు. కొన్ని కొన్ని విషయాలను అంత సులభంగానూ త్వరితంగానూ ఎందుకు మరిచి పోతావు? వాటిపైన తగినంత ఆసక్తి లేక. అవునా? ఈ గతించిన సంఘటనలు కొన్ని నీకు ఆసక్తి కలిగించేవి, అందువల్లనే నీ మనస్సు వాటిని పదిలపరుచుకుంటున్నది. మార్గాంతరం ఏమిటి? వాటికి ప్రాముఖ్యాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యం చెయ్యటమే. గతించిన వాటికి విలువ లేదని నువ్వు గ్రహించినప్పుడు జ్ఞాపకాలు వాటంతటవే వాడి జీవరహితమయి పోతాయి. వర్తమానాన్ని నీ అదుపులో ఉంచుకో. గతించిన దానికి వగచి వర్తమానాన్ని వొదులుకోకు. నువ్వింకా చిన్నదానివి. జ్ఞానార్జన చెయ్యవలసిన అగత్యం ఇంకా ఎంతయినా ఉంది. తాత్కాలిక ఉద్రేకానికి లొంగి పరిస్థితులనుంచి పారిపోవటం సంస్కారుల లక్షణం కాదు. మనస్సు ప్రశాంత మయినప్పుడు, 'నా' అన్నది నీలో మిగలనప్పుడు నిజమైన వైరాగ్యాన్ని పొందుతావు. ప్రస్తుతం నిన్ను బాధ పెడుతూన్న సమస్యల నుంచి దూరంగా పారిపోయి నువ్వు సాధించగలిగిందేమీ లేదు. సమస్యల నుంచి కాదు నువ్వు పారిపోయేది-నీ సమస్యలకు సంబంధించిన పరిస్థితుల నుంచి-కానీ సమస్య లెప్పుడూ నీలోనే ఉంటాయి నీ మనస్సే నీ సమస్యల కర్మాగారం. హఠాత్తుగా నీ మనస్సునుంచి నువ్వు పారిపోగలవా? దానికి కృషి అవసరం. అప్రమత్తత అవసరం. నువ్వు విద్యావతివి. నీకింతకన్న ఏం చెప్పనమ్మా? వెళ్ళి ప్రస్తుతానికి శ్రద్ధగా చదువుకో తల్లీ".

స్వాముల వారి మీద ఉన్న భక్తిభావంకొద్దీ మారు వాదించలేక పోయాను. ఆయన చెప్పిన దాన్ని మననం చేసుకోవటానికి ప్రయత్నిస్తా నని చెప్పి నమస్కరించి ఇంటి ముఖం పట్టాను. దారిలో కాల్టెక్స్ దగ్గర మూర్తి ఎదురయ్యాడు. ఎవరికైతే దూరం కావాలనుకుంటున్నానో అతనే మరింత దగ్గరికి వస్తున్నాడు. నిమిత్తమాత్రంగా పలకరించాను.

'ఎండలో ఎక్కణ్ణించి వస్తున్నావ్?' అన్నాడు ఆప్యాయంగా నన్ను చూస్తూ.

'రామకృష్ణామిషన్నుంచి'.

వెంటనే అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

'ఇదుగో, నీబుర్రలో ఏదో తిరుగుతోంది. నిన్న హైదరాబాదు నుంచి వచ్చినప్పటినుంచి చూస్తున్నాను. మనిషివి మారిపోయినట్లుగా వింతగా ప్రవర్తిస్తున్నావ్. ఏమిటి నీ ఉద్దేశం? మాట్లాడవేం? చెప్పరాదూ నామీద ప్రేమ ఇంకేమీ లేదని. మీనాన్న చూసిన సంబంధమే చేసుకుం టానని స్పష్టంగా చెప్పరాదూ? ఈ ముసుగులో గుద్దులాట ఎందుకూ?' మూర్తికంఠం ఒణికింది. ఎండకి మొహం మరింత ఎర్రబడింది.

'మూర్తీ, నువ్వు ఊహించినది నిజంకాదు'.

'పోనీ నిజమేదో చెప్పు' అని తొందర పెట్టాడు.

'సరే, పద. చెబుతాను.'

అటుపక్కన ఉన్న జీడితోపుల వైపు దారి తీశాడు. చాలాదూరం నడిచి బాగా నీడగా ఉన్నచోటు చూసుకుని పెద్ద జీడిమామిడి చెట్టు కింద రాలిన ఆకుల మీద కూర్చున్నాం. నాచేతిలోని పుస్తకాలు తీసుకుని తల కింద పెట్టుకుని పడుకున్నాడు మూర్తి. నా చేతిని లాక్కుని గుండెమీద పెట్టుకున్నాడు. 'ఊఁ, చెప్పు' అన్నాడు.

నా ఒళ్లంతా జలదరించినట్లయింది. చెయ్యి వెనక్కి లాక్కోబోయాను. మరింత గట్టిగా పట్టుకున్నాడు. అతని గుండెలు తీవ్రంగా కొట్టుకుంటున్నాయి. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో నా చెయ్యి కూడా కదుల్తోంది.

'మూర్తీ, హైదరాబాదు నుంచి వస్తూ దారిలో రాజమండ్రీలో ఓ పూట ఉన్నాను' అన్నాను—ఎక్కడో అక్కడ మొదలు పెట్టాలి కదా అని.

'అచ్చా! రాజమండ్రీలో ఎవరున్నారు నీకు? ఇక్కడ నీ దర్శనం లేక నేను గిలగిల్లాడి పోతూంటే నువ్వు పెత్తనాలు చేస్తున్నావన్నమాట!'

అతను నవ్వుతూనే అన్నప్పటికీ, నేనిక్కడ నిష్కల్మష ప్రేమతో నీ కోసం ఎదురు చూస్తూంటే నువ్వెళ్లి మరొకడికి శరీరాన్ని అప్పగించి వచ్చావా—అంటున్నట్లు తోచి మూర్తి కళ్లలోకి చూడలేకపోయాను.

'రాజమండ్రీలో నా స్నేహితురాలు సుధ ఉంది. ఎవరినో దిగబెట్టటానికి స్టేషనుకి వచ్చారుట. నన్నుచూడగానే వాళ్లింట్లో ఓ రోజు ఉండమని బలవంతం చేశారు.'

'బలవంతం చేశారని ఉండిపోయావ్' అన్నాడు నవ్వుతూ.

'అంతే కాదు మూర్తీ—ఆ రాత్రి సుధ మొగుడు-నన్ను...' ఎంత నిగ్రహించుకుందామన్నా నా గొంతులో బాధ భయం స్పష్టమవుతున్నాయి. ఎలా కొనసాగించాలో, ఏ మాటల్లో చెప్పాలో తెలియక తలెత్తి మూర్తి మొహంలోకి చూశాను. అతని చూపులు వేటగాడి బాణాన్ని ఎదుర్కొంటూన్న లేడి చూపుల్లా ఉన్నాయి. అతని పిడికిలి గట్టిగా బిగుసుకుంది. ఆ పిడికిలిలో నా చేతివేళ్లు నలిగిపోతున్నాయి. వెంటనే ఏదో మొండి ధైర్యం ఆవహించింది.

'రాత్రి నేను నిద్రలో ఉండగా సుధ మొగుడు వచ్చి...' నా గొంతు పూడిపోయింది. తలవంచుకున్నాను. మూర్తి పిడికిలి పాషాణమయి పోయింది. నా వేళ్లు విరిగి పోతాయనుకున్నాను. అతని కన్నుల్లోని భయ విహ్వాలతను భరించలేకపోయాను. చివరికి ప్రాణం బిగపెట్టుకుని చెప్పవలసిన మాటలు చెప్పేశాను మంత్రముగ్ధలా.

ఠక్కున నా చెయ్యి పట్టువదిలేశాడు. అతని గుండెల మీంచి నా చెయ్యి కిందికి జారిపోయింది. నాకుతెలుసు మూర్తికిది విద్యుదాఘాత మని. సాంప్రదాయకమయిన కుటుంబంలోంచి వచ్చిన ఎవరికైనా అది ఆఘాతమే. దానికి తట్టుకుంటాడని నేను అనుకోనూలేదు. చాలాసేపు అతనేమీ మాట్లాళేదు. నేను ఎండి రాలిన ఆకుల్ని చూస్తూ అతను ఏమంటాడోనని ఎదురుచూస్తూ కూర్చున్నాను. మెల్లిగా లేచి మోకాళ్ళమీద గడ్డం ఆన్చి కూర్చున్నాడు. రెండుచేతుల వేళ్ళనూ జుట్టులోనించి పోనిస్తూ 'నాకెందుకు చెప్పావు రమా?' అన్నాడు. బాధగా మూలిగినట్టుంది అతని గొంతు. విశాలమయిన నుదుటిమీద అడ్డంగా మూడుగీతలు పడ్డాయి.

'చెప్పకుండా ఎలా ఉండను మూర్తీ?' 'మనస్సులో ఇటువంటి భీకరసత్యాన్ని దాచుకుని నీతో ఎలా జీవించగలననుకున్నావ్?' ఆకాశం వంక చూస్తూ అడిగాదా ప్రశ్న.

మూర్తి సామాన్యమానవుడు. సాంఘిక నియమాలు ఎరిగినవాడు, ప్రేమించాననుకున్నవాడూ అంతకన్న ఏమని అడుగుతాడు? పరిస్థితిని నేనర్థం చేసుకున్నాను.

'మూర్తీ, పొరపాటుపడుతున్నావు. అన్యాయంగా నిన్ను నీ ప్రేమ తోనే బంధించాలని నేను ఆలోచించలంలేదు. నా బలహీనత వల్ల కలిగే

ఫలితాలను అనుభవించటానికి సిద్ధంగానే ఉన్నాను. అందులో నిన్నిరికించటం నా అభిమతంకాదు.'

'ఇప్పుడు నేనేమైపోవాలి' కళ్లు మూసుకుని అస్పష్టంగా గొణుక్కున్నాడు. అతన్ని ఏ విధంగా సముదాయించను? చెట్టుమీది కాకి రెక్కలు విదిలించుకుని రివ్వున ఎగిరి పోయింది. చెట్టు ఆకులు కొన్ని గల గల మంటూ మా మీద రాలాయి. మూర్తి ఉలిక్కిపడి కళ్లు తెరిచి నా వంక చూశాడు. చటుక్కున నా చేతులు రెండూ పట్టుకుని 'రమా, నేనేమైపోను? నువ్వులేకుండా నేనేమైపోను?' అన్నాడు. మూర్తిని చూస్తూంటే పసిపిల్లవాడు గుర్తు కొచ్చాడు. గుండెల్లో పొదివి పట్టుకోవాలనిపించింది.

'నేనెక్కడికి పోతాను మూర్తీ! చచ్చిపోవటం లేదు కదా. కలిసి జీవించనంత మాత్రాన ఏమవుతుంది! నీ మీద ప్రేమ ఎప్పుడూ ఉంటుంది. స్థలానికీ సమయానికీ అతీతంగా ఉంటుంది.'

నా మాటలు వినిపించుకోలేదు, మరింత ఉద్వేగపడుతూ 'నువ్వు కావాలి రమా-నువ్వు కావాలి-కాని ఇలా కాదు-ఇలాకాదు' అంటూ అరిచాడు. మూర్తి చేతుల్లోంచి నా చేతుల్ని విడిపించుకున్నాను. ఇంతటి ఆవేశపరుణ్ణి అమాయకుణ్ణి ఎలా ప్రేమించానా అని ఆశ్చర్యపోయాను.

'లే, మూర్తీ, పోదాం, ఆలస్యం అవుతోంది' అంటూ లేచి పుస్తకాలు తీసుకున్నాను.

జీడిమామిడి తోపులోంచి రోడ్డుదాకా మౌనంగా నడిచాం. మలుపు రాగానే అతను ఏమీ అనే అవకాశం ఇవ్వకుండా నేనే 'వెడతాను మూర్తీ, క్షమించమని అడిగే అర్హత లేకపోయినా అడుగుతున్నాను. క్షమించు' అనేసి ఇంటిదారి పట్టాను. పైన ఎండ, లోపల బాధ. ఎంత పట్టించుకో

కుండా ఉందామన్నా మూర్తి ప్రవర్తన నన్ను విపరీతంగా బాధపెట్టింది. అకస్మాత్తుగా అగాధంలోకి పడిపోయినట్లుగా ఉంది. నిస్సహాయంగా అనిపించింది. కర్తవ్య విమూఢురాలినై పోయాను. మనస్సు నిర్జీవమైపోయింది యాంత్రికంగా నడిచివెళ్ళాను ఇంటికి.

'అలా ఉన్నావేమిటే' అంది పిన్ని నన్ను చూడగానే. పుస్తకాలు బల్లమీద పడేసి మంచంమీద వాలిపోయాను.

'ఎండదెబ్బ కొట్టిందో ఏమో. లేచి వెళ్ళి మొహమూ, కాళ్ళూ, చేతులూ కడుక్కురా, కాస్త అన్నం తిందుగాని' అంది.

సమాధానం చెప్పకుండా చూరువైపు చూస్తూ ఉండి పోయాను. ఆలోచనలు గూళ్ళు కట్టుకోసాగాయి.

నాసంగతి వినగానే మూర్తి నన్ను ఏవగించు కుంటాడనీ, నామీద ప్రేమ చంపుకుంటాడనీ నేను ముందే ఊహించుకున్నాను. జరుగనున్న దాన్ని ఎదుర్కోవటానికి మానసికంగా సంసిద్ధురాలి నయ్యాను. కానీ, అనుకున్నదే తీరా జరిగేటప్పటికి అంతులేనిబాధ. అంతరాంతరాల్లో ఇంకా 'మూర్తి నన్ను అర్థంచేసుకుని నన్ను వివాహం చేసుకుంటాడనే ఆశ కొనఊపిరితో ఉండటం వల్లనా? అతని పై 'ఆశ' నాలో ఓ మూల స్థావరం ఏర్పరచుకున్నట్లు నేను అణుమాత్రమయినా గ్రహించలేదా? లేక గ్రహించి కూడా నన్ను నేను మభ్యపెట్టుకో జూచానా? సర్వసంసిద్ధతతో ఎదురు చూసినదానికి క్షోభదేనికి? మూర్తి నన్ను నిరాకరించినంత మాత్రాన నేను బాధ పడటం ఎందుకు? నిన్న అతనికి వివాహం గురించి చెప్పినదంతా అర్థ శూన్యమేనా? కాదు-కాదు. నేనెంతో ఆలోచించుకుని నేను సంపూర్ణంగా నమ్మినదాన్నే అతనికి చెప్పాను. నన్ను నేను మోసగించుకోలేదు. మూర్తి ప్రవర్తన నా కనుగుణంగా లేదని బాధపడటం భావ్యంకాదు. నా బాధకి

అహంభావం తప్ప మరోకారణంలేదు. అన్ని అనర్థాలికీ ఈ అహం భావమే మూలకారణం. దాన్ని అణచుకోవాలి. అప్పుడే నాకు మనశ్శాంతి... నా మనస్సులో బాధ నా కర్థమయిపోయింది. మనస్సు తేలిగ్గా ఉందిప్పుడు. ఎవరికోసమయితే మొన్నటి నుంచీ వ్యక్తావ్యక్తంలో సంఘర్షణకు లోనైయానో వారికి నేనక్కర్లేదిప్పుడు. బాధ్యత తీరిపోయింది. ఆత్మ వంచనకిగాని పరవంచనకిగాని ఆస్కారంలేదిప్పుడు. మోహంగాని ప్రేమ గాని లేదిప్పుడు. నేననుసరించదలుచుకున్న మార్గానికి ఆటంకాలు లేవి ప్పుడు. నిస్సంకోచంగా నిదానంగా వెళ్ళొచ్చును. నేను వెళ్ళాలి. వెళ్ళితీరాలి.

మధ్యాహ్నం మూడింటికి కాఫీ తాగి కట్టుబట్టల్తో బయల్దేరాను స్టేష నుకి. స్వాములవారితో కలిసి—ఆయన వద్దన్నాసరే—ఆయనతో కలిసి కలకత్తా వెళ్ళిపోవాలని బయల్దేరాను. 'లైబ్రరీకి వెడుతున్నానని చెప్పాను పిన్నితో ఆఖరి బంధనాన్ని తెంచుకునే సమయంలో చిన్న అబద్ధం ఆడక తప్పలేదు.

బస్సుకోసం నిలబడ్డాను. ఒకటి తరవాత మరోటి పోటీపడుతూ రెండు బస్సులు టౌను వైపు వెళిపోయాయి. టౌను నుంచి ఒక్కటీరాలేదు. ఎదురు చూస్తున్నాను. హఠాత్తుగా రామ్మూర్తిగారు కనిపించారు- దూరాన. నావైపే నడిచి వచ్చేటట్లున్నారు. ఈయన్నిప్పుడెల్లా తప్పించుకోవటం? ఒత్తి జిడ్డుమనిషి, పట్టుకుంటే వొదల్డు. ఏదైనా పనిమీద ఆయన మరోవైపుకి పోతే బావుండుననుకున్నాను.

'ఏమమ్మా, ఎండలో నిలబడ్డావ్? ఎక్కడికేమిటి ప్రయాణం?' అన్నాడు నన్ను సమీపించి. నాగుండె దిగజారి పోయింది క్షణంసేపు- మొండిగా గుండె కుదుట పరుచుకుని 'స్టేషనుకండి' అన్నాను.

'మీవాళ్ళెవరన్నా వస్తున్నారేమిటి ?'

'అవునండి' అన్నాను తడుముకోకుండా. ఆమాత్రం అబద్ధం ఆడక తప్పలేదు. ఈ జనం మధ్య ఉంటే అడుగడుగునా అబద్ధాలాడటం అనివార్యమవుతుంది. సత్యవాక్పరిపాలన కెంత కట్టుబడి ఉన్నప్పటికీ ఎదుటివారి మనస్సుకి కష్టం కలుగుతుందనో, వారికి ఇబ్బంది కలుగుతుందనో ఎన్నో చిన్నచిన్న అబద్ధాలు చెప్పవలసివస్తుంది కొన్నికొన్ని సమయాల్లో.

గుడ్డిలో మెల్ల అన్నట్లు నా అదృష్టం కలిసొచ్చి టౌను వెళ్ళే బస్సు మరోటి దూసుకుంటూ వచ్చి మా ముందు ఆగింది. రామ్మూర్తిగారు చప్పున అందులోకి ఎక్కి ఓసారి వెనక్కి తిరిగి నావైపు చూశారు లోపలికి వెళ్ళి కూర్చునే ముందు—'ఇంకా అడిగి అన్ని విషయాలూ తెలుసుకోలేకపోయానే' అన్న బాధ ఆయన మొహంలో స్పష్టంగా కనిపించింది. ఒకరికి అదృష్టాన్ని చేకూర్చినదే మరొకరి దురదృష్టానికి హేతువవుతుంది. ఈ లోకపు తీరే అంత. ఈ సంఘర్షణల్లేని, స్వార్థరహిత వాతావరణంలోకి నేను వెళ్ళబోతున్నానని హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. బస్సు వచ్చింది.

స్టేషనుకి వెళ్ళేసరికి రైలు వచ్చేసి ఉంది. హడావిడిగా టిక్కెట్టు కొనుక్కుని రైలు దగ్గరికి పరుగెత్తాము. స్వాములవారు కనిపిస్తారేమోనని ఆత్రుతగా అన్ని పెట్టెల వైపూ చూస్తూ హడావిడిగా నడుస్తున్నాను. హఠాత్తుగా పరిచితమయిన నవ్వు కనిపించింది. నడక ఆపి అటువైపే చూశాను. శేఖరం నవ్వుతూ రైలు దిగుతున్నాడు. నేను తేరుకునే లోపునే నన్ను సమీపించాడు.

'హలో, నేనింత అదృష్టవంతుణ్ణి అనుకోలేదు. అనుకోకుండా స్వాగతం లభించిందే !'

మర్యాద చిహ్నమయిన చిరునవ్వు నవ్వాను. అతను సూట్‌కేసూ బెడ్డింగూ దించుకుంటూంటే ఇటూ అటూ హడావిడిగా చూశాను స్వాముల వారి జాడ ఏమన్నా కనిపిస్తుందేమోనని. శేఖరాన్ని వొదిలిపెట్టి స్వాముల వారిని వెతకటానికి వెళ్ళాలంటే ఇబ్బందిగా తోచింది. నేను సన్యసించి కలకత్తా వెళ్ళబోతున్నానని శేఖరంతో చెప్పటానికి మరింత ఇబ్బందిగా తోచింది. చేతిలోని టిక్కెట్టు చూసుకున్నాను. ఏం చెయ్యనిప్పుడు? 'పదండి' అన్నాడు శేఖరం.

నేను చెయ్యబోయే పని హాస్యాస్పదంగా చేసుకోవటం నా ఉద్దేశం కాదు. ఇప్పుడు కలకత్తా వెళ్ళటానికి తగిన సమయం అవునో కాదో తెలియలేదు. ఎప్పుడూ ఏదో ఒక అడ్డం తగుల్తూనే ఉండొచ్చును. ఈ లెక్కని ఎప్పటికి సాధ్యమవుతుంది? ఇంతవరకూ వచ్చాక ఇక వెనుదీయ కూడదు. చెబితే అతను అర్థం చేసుకోకపోడు.

'ఏమిటి ఆలోచిస్తున్నారు? ఎవరి కోసమన్నా ఎదురు చూస్తున్నారా? అన్నట్టు మీరు స్టేషనుకి ఎందుకొచ్చారు?'

తెగించి చెప్పేశాను. 'కలకత్తా వెడదామనుకుంటున్నాను.'

అతను వెంటనే ఎందుకు, ఏమిటి అంటూ గాభరా పడలేదు. తాపీగా అడిగాడు.

'నిజమా! సామానెక్కడ పెట్టారు? ఒక్కరూ వచ్చారేం? మీ పిన్ని, బాబయ్య కులాసాగా ఉన్నారా?

వివరంగా చెప్పటం తప్పనిసరి అయింది. 'రామకృష్ణా మిషన్‌లో చేరటానికి వెడుతున్నాను. అందరిలాగా మామూలు జీవితం జీవించాలని లేదు నాకు.'

'మీ వాళ్ళకి తెలుసునా?' నిదానంగా అడిగాడు. చిరునవ్వునవ్వుతూ 'తెలియదనుకోండి. తెలిస్తే ఆపుచెయ్యటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు కదా' అన్నాను.

'నేనలా చెయ్యనని మీకు ధైర్యం ఏమిటి?' అన్నాడు మృదువుగా నవ్వుతూ.

'మీరంత ఉద్వేగపరులు కాదనుకుంటాను. సానుభూతితో అర్థం చేసుకుని నన్ను ప్రోత్సాహపరుస్తారన్న నమ్మకం నాకుంది' అన్నాను అతని ముందుకాళ్ళకి బంధం వేస్తున్నట్లుగా.

'నామీద ఆ మాత్రం సదభిప్రాయం ఏర్పడింది. అంతే చాలు... కానీ, ఒక్క విన్నపం.'

ఏమిటన్నట్లు చూశాను.

'మీతో కాస్సేపు మాట్లాడే అవకాశాన్నివ్వాలి.' అని రిస్టువాచీ చూసుకున్నాడు. 'ఇంకా చాలాసేపు ఆగుతుంది రైలు' అన్నాడు.

సరేనన్నాను. స్వాములవారిలాగే శేఖరం కూడా సమంజసంగానూ నిర్వివాదంగానూ మాట్లాడగలడన్న భావం కలిగింది. అతను ఏమంటాడో విందామన్న కుతూహలం కూడా కలిగింది.

సామాను తీసుకుని రైల్వే రెస్టారెంట్ లోకి తీసుకువెళ్ళాడు. హాల్లో గోడమూల రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అక్కడ కూర్చున్నాం. రెండు కాఫీలు ఆర్డరు చేశాడు. ఎదురుగా కొంచెం దూరంలో 'చౌదరి' నన్ను చూసి చిరునవ్వుతో పలుకరించాడు. సమాధానంగా చిరునవ్వు నవ్వాను. శేఖరం వెనక్కి తిరిగి చూసి 'ఎవరతను' అన్నట్లు నాకేసి చూశాడు. 'మా క్లాస్ ఫెలో' అన్నాను.

'పరీక్ష లెప్పటినుంచి? బాగా చదివారా?' శేఖరం ఆ ప్రశ్న అడగటంలోని యుక్తిని నేను అర్థం చేసుకోకపోలేదు. నేను వెళ్ళిపోతున్నానని చెప్పిన తరవాత కూడా మామూలుగా యధాలాపంగా నా చదువు ఎలా సాగుతోందని అడగటంలో అతని ఉద్దేశం ఏమిటో నాకు తెలుసు. అలా ఈ కబురూ ఆ కబురూ చెప్పి మరిపించటానికి నేనేం పసిపాపని కాదు.

సర్వరు కాఫీలు పట్టుకొచ్చాడు. సిగరెట్ యాష్‌ట్రేలో పడేసి కాఫీకప్పు నా చేతి కిచ్చాడు శేఖరం—సర్వరు నా ఎదురుగా పెట్టిన కప్పు మరోటి ఉన్నప్పటికీ. శేఖరం నా ముందున్న కప్పుని తనముందుకి లాక్కున్నాడు.

'ఈ రైలుకే నేను వెళ్ళాలి' అన్నాను—కబుర్లతో కాలక్షేపం చేసి రైలు దాటిపోయేటట్లు చేద్దామనే అతని ఉద్దేశమైతే అతని గడుసుతనానికి లొంగిపోయేటంత తెలివి తక్కువ దాన్ని కాదని సూచిస్తూ.

'అలాగే, తప్పకుండా వెడుదురు గాని. మిమ్మల్ని జాగ్రత్తగా రైలెక్కించే పూచీ నాది' అన్నాడు నా సంగతి పసిగట్టేసినట్లు.

తొందరపడి అనవసరంగా భుజాలు తడుముకున్నానేమో అనుకున్నాను. కాకపోయినా, ఈ సమయానికే అతను వాల్తేరు ఎందుకు రావాలి ?

'ఏదన్నా పనిమీద వచ్చారా ఇక్కడికి? ఇంతత్వరలో వస్తున్నట్లు మొన్న నేను బయలుదేరేటప్పుడు చెప్పలేదే!' సంభాషణ అతనిపై పుకి మొగ్గేటట్లు అడిగాను—ఆ విధంగానైనా నా గురించి వివరాలు అతనికి చెప్పే అవసరాన్నుంచి తప్పించుకోవచ్చునని. ఎలాగో, ఈ కాస్సేపూ

గడిపేస్తే నేను రైలెక్కి పోవచ్చును. నన్ను బతిమాలి గాని బలవంతం చేసిగాని నా ప్రయాణాన్ని ఆపుచేసే చనువూ చొరవా అతనికి లేవు. ఆ ఆలోచన రాగానే నా గుండె కొంచెం కుదుటబడింది.

'మీతో మాట్లాడదామనే వచ్చాను.'

అతని కన్నుల్లో కొంటెతనం లాంటిదేమైనా కనిపిస్తుందేమోనని చూశాను. పైకి కనిపించకపోయినా నన్ను హేళన చెయ్యటానికే ఆ మాటలన్నాడని అనుమానం వేసింది.

'నేను వెళిపోతున్నట్లు కలొచ్చిందా ?'

'వేళాకోళం కాదు' గంభీరంగా అన్నాడు. ఇది మరీ బావుంది ! వేళాకోళం ఆడుతున్నది మధ్య నేనా !

'ఆవేళ మీరు స్టేషనుకి చాలా ఆలస్యంగా వచ్చారు. మీతో సావకాశంగా మాట్లాడే అవకాశం లభించలేదు. ఆరోజు పొద్దున్న మీ ఇంటికెళ్ళాను—మీతో మాట్లాడదామని. మీరు ఎవరో స్నేహితులతో కలిసి షాపింగుకి వెళ్లారని చెప్పారు మీ అమ్మగారు. ఏమయినా సరే, మీతో వివరంగా మాట్లాడాలనుకున్నాను. మీరన్నట్లు 'కల' రాలేదు గానీ, ఏదో అనిర్వచనీయమైన శక్తి మాత్రం నన్ను తొందరపెట్టింది వాల్తేరు వెళ్ళి రమ్మని. వెంటనే సెలవుపెట్టి బయలుదేరాను...'

ఇప్పుడు మళ్ళీ మొదటికొస్తాడులా వుంది భగవంతుడా అనుకుని టైము చూసుకున్నాను. అది గమనించినట్లు అతను వెంటనే లేచాడు. 'అమ్మయ్య' అనుకున్నాను.

కానీ, నేననుకున్నట్లు సరాసరి రైలు దగ్గరికి తీసుకుపోలేదు. వెయిటింగ్ రూమ్ వైపు దారి తీశాడు. అతన్ని అనుసరించాను. చూస్తే

అక్కడ చాలామంది జనం ఉన్నారు. 'ఇక్కడొద్దు, అలా ముందుకి పదండి' అన్నాడు. ప్లాట్‌ఫామ్ చివరిదాకా వెళ్ళి అక్కడ మట్టినేల మీద పెట్టె, బెడ్డింగూ పడేశాడు. తన పెట్టెమీద నన్ను కూర్చోమని తను బెడ్డింగ్‌మీద కూర్చున్నాడు.

జేబులోంచి సిగరెట్‌పెట్టె, అగ్గిపెట్టె, తీసి సిగరెట్ ముట్టించాడు. సిగరెట్ నిదానంగా కాలుతోంది. వలయాలు తిరుగుతూ క్రమంగా దూరమై గాలిలో కలిసిపోతున్న సిగరెట్ పొగని చూస్తున్నాను. అతను నా మొహాన్నే పరిశీలిస్తున్నట్టు తోచింది. పొగని చూడటం మానేసి అతని కన్నుల్లోకి చూశాను. అతను చెక్కు చెదరలేదు. నన్నే చూస్తున్నాడు. చంద్రుణ్ణి తదేకంగా చూడగలిగినట్లు తొట్రుబాటు లేకుండా అతని చూపుల్ని తట్టుకోగలిగాను. చివరికి అన్నాడు.

'ఊఁ, అయితే మీకు జీవితంమీద విరక్తి కలిగిందన్నమాట.'

నేను సమాధానం చెప్పలేదు అది ప్రశ్నరూపంలో లేదు కాబట్టి.

'అంత తొందర పెట్టిన కారణం ఏమిటో చెబుతారా?' దానికి సమాధానం చెప్పలేదు—ఎక్కణ్ణించి చెప్పాలో ఎంతవరకు చెప్పాలో తెలియక.

'మీకింకా నామీద తగినంత నమ్మకం కుదిరినట్టు లేదు. దయచేసి నా ఉనికినీ, నా వ్యక్తిత్వాన్నీ మరచిపోయి మీతో మీరు చెప్పుకుంటున్నట్లుగా చెప్పండి. మిమ్మల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను. అంతకన్న నేను కోరేదేమీ లేదు.' మరొక సిగరెట్ వెలిగించాడు.

'మూర్తి మా యూనివర్సిటీలో లెక్చరర్. అతనూ నేనూ ప్రేమించుకున్నాం. వివాహం చేసుకుందామనుకున్నాం. అందువల్లనే మిమ్మల్ని ఒప్పుకోలేదు. అమ్మనీ, నాన్నగార్నీ నిరుత్సాహపరచి, బాధ కలిగించి,

హైదరాబాదు నుంచి వస్తూ దారిలో రాజమండ్రిలో మా స్నేహితురాలి బల వంతం మీద ఒక రోజుకి వాళ్ళింట్లో దిగాను ఆ రాత్రి మా స్నేహితురాలి భర్త నేను నిద్రలో ఉండగా వచ్చి నన్ను స్వాధీనపరుచుకున్నాడు. ఆ విషయాన్ని నాలోనే దాచుకుని మా ప్రేమవివాహాన్ని కలుషితం చెయ్య దలుచుకోలేదు. దాచినంత మాత్రాన నా మనస్సుగాని శరీరంగాని పరి శుద్ధం కాలేవు. ఆత్మవంచన చేసుకోవటమే కాకుండా నా స్వార్థబుద్ధితో మూర్తిని కూడా వంచించినట్లవుతుంది. అతనితో చెప్పటానికి సంశ యించాను మొదట—అతను నాకు దూరమయిపోతాడేమోనన్న భయంతో. మనస్సులో కొంత సంఘర్షణ జరిగిన తరవాత మరోమార్గం స్ఫురించింది. అతనితో అసలీ విషయం చెప్పకుండా కేవలం నేను వివాహం చేసుకో దలుచుకోలేదని చెప్పి రామకృష్ణుని మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించు కున్నాను. స్వార్థం కోసం మూర్తిని మోసగించిగాని, ఒప్పించిగాని వివాహం చేసుకునే బదులు ఈ మార్గం ఉన్నతమయినదిగా తోచింది. మూర్తికి నా ఉద్దేశం చెప్పాను. అతను అర్థంచేసుకోలేదు. వివాహం ఎందుకు చేసుకోదలుచుకోలేదో చెప్పమని నిలదీశాడు. అసలు సంగతి చెప్పాను. అతను—నీళ్ళకుండీలో పడ్డ ఎలుక పిల్ల గట్టుమీదికి రాలేక, లోపల నీళ్ళలోకి పోలేక గిలగిల్లాడినట్లు బాధపడ్డాడు. అతని మానసిక బలహీనత చూశాక మరింత విరక్తి పుట్టింది.'

ఆఖరి దమ్ము పీల్చి సిగరెట్ అవతలికి విసిరేశాడు శేఖరం. పొగ పక్కకి తప్పుకుంది. నిశ్చలంగా నాకేసి చూస్తూ అన్నాడు. 'అంతా బాగానే ఉంది. కాని, మీరు వేదాంతమార్గాన్ని అనుసరించవలసిన అగత్యం ఏమిటి? వివాహం చేసుకుని తీరాలని లేదు. అలాగని సన్యాసం పుచ్చుకోవాలని ఎక్కడా లేదే...'

నా పెదిమలు కదిలాయి. నన్ను ఏమీ చెప్పనివ్వకుండా అతనే మళ్ళీ అన్నాడు.

'మీరు శరీర పారిశుద్ధ్యం, ఆత్మవంచన అంటూ చాలా మాటలు వాడారు. అసలు పారిశుద్ధ్యం అంటే ఏమిటి? శరీరాన్ని నిర్బంధంలో పెట్టినంత మాత్రాన పరిశుద్ధంగా ఉన్నట్లేనా? మనస్సు మాటేమిటి? మనస్సులోని ఆలోచనలు పరిశుద్ధంగా ఉంచగలరా? ఏదో బలీయమైన కారణాంతరాల వల్ల బ్రహ్మచర్యం అవలంబించినంత మాత్రాన 'నేను బ్రహ్మచారిని' అన్న స్పృహ అతనికి లేకుండా ఎలా ఉంటుంది! అంటే కేవలం బాహ్యపరిస్థితుల వల్ల శరీరాన్ని నిర్బంధంలో ఉంచాడన్న మాటే కదా. ఎవరైనా ఆకర్షణీయమైన స్త్రీని చూడగానే తాత్కాలికంగా అతని మనస్సు చలించవచ్చు. కాని అతను సాధనచేసి అలవరచుకున్న సంస్కారం, ఆత్మశిక్షణ—శరీరాన్ని అదుపులో ఉంచగల శక్తిని అతనికిస్తాయి. 'నేను బ్రహ్మచారిని' అన్న స్పృహ అతనికి ఉన్నంతకాలం 'పారిశుద్ధ్యం' అనే పదానికి అర్థంలేదు. ఆ 'స్పృహ' శరీరాన్ని నిర్బంధించినంత కాలం ఉండి తీరుతుంది. అలాగే పాతివ్రత్యమూను. పాతివ్రత్యం అలవరచుకుంటే వచ్చేది కాదు. పతివ్రతగా ఉండాలి అన్నంత మాత్రాన పాతివ్రత్యం సిద్ధించదు. మీరిప్పుడు సన్యాసం పుచ్చుకోవాలనుకుంటున్నారు. ఆ తరవాత, ఎందువల్ల సన్యాసం పుచ్చుకున్నారో ఆ కారణం మీ మనస్సులోంచి తప్పుకుంటుందా? ఆ 'స్పృహ' మీలో ఉన్నంతకాలం మీ సన్యాసానికి అర్థం లేదు.

మరో విషయం చూడండి—మీ స్నేహితురాలి భర్త చేసిన పనిని మీరు ఏవగించుకుంటున్నారు. రెండు కారణాల వల్ల—ఆ పని సాంఘిక నీతి నియమాలకు విరుద్ధం కావడం వల్లనూ, మీ మనస్సంతా మూర్తివైపు మొగ్గి ఉండటం వల్లనూ. అవునా? మీరు కారులో రోడ్డు మీద పోతూంటే

ఎదుటినుంచి ఎవరో నియమాలకు వ్యతిరేకంగా మరో కారు నడిపించు కుంటూ వచ్చి మీ కారుని ఢీకొంటాడు. మీ కారు దెబ్బతింటుంది. మీరు మాత్రం సరియైన మార్గాన్నే, నియమబద్ధంగానే వెళ్లారు. అయినా కారు పాడైంది. అక్కడ మీ మనస్సు 'నియమోల్లంఘనం' గురించి బాధపడ వలసిన అవసరం లేదు కదా. కారుని బాగుచేయించుకుంటారు — అంతే. ఆ కారు నిరుపయోగం అని తెలితే మరో కొత్తకారుకొనుక్కుంటారు. లేక పోతే మరో వాహనం మీద ప్రయాణం చేస్తారు లేదా, కాలినడకని పోతారు అంతేకాని, ఆ రోడ్డుమీంచి ఇంకెప్పుడూ పోనని మూర్ఖంగా పట్టుపట్టరు కదా!...'

'ఇంతకీ ఏం చెబుదామని ఇతని ఉద్దేశం?' అనుకున్నాను.

'రమా...'

ఆశ్చర్యంగా అతని వైపు చూశాను. ప్రప్రథమంగా నన్ను చను వుగా సంబోధించాడు.

'నీకు తెలివితేటలున్నాయి. అందుకే నీ మీద నాకు గౌరవం, అభిమానం. నువ్వు చదువుకుని శాస్త్రపరిశోధన చేసి పైకిరాగల స్తోమత ఉన్న దానివి. నువ్వు వృథా అయిపోవటం నాకిష్టంలేదు. పరీక్షలయి పోగానే హైదరాబాదు రా. ఈ లోపున నీ రిసెర్చికి అమెరికాలో స్కాలర్ షిప్ కోసం ప్రయత్నిస్తాను. దొరక్కపోదు. లేకపోయినా ఎలాగో అలా సాధించి వెళ్లేట్లు చేస్తాను. నువ్వు నాకూడా ఉండి నాకు చేదోడు వాదోడుగా ఉండి శాస్త్రపరిశోధనలో కృషి చేస్తే మనం సాధించలేనిది ఉండదు. నీ తోడు కావాలి నాకు. జీవనసహచరులుగా ఉండటానికి ఆడపిల్లలు అనేక మంది దొరుకుతారు. కానీ నీలా ఆలోచనాశక్తి ఉన్న ఆడపిల్ల దొరకటం

అరుదు. అరుదైనదే నాకు కావలసినది. ఇంతకాలం నేను ఆగినది కూడా అందుకే.'

'నాకు జరిగిన సంఘటన విషయం?'

'అటువంటి అల్పవిషయాల గురించి నేనెప్పుడూ ఆలోచించను నాకా ఆసక్తి లేదు.

'అంటే, నీతి నియమాలంటే లెక్క చెయ్యరా?'

'చెయ్యనని కాదు. ఆ మాట కొస్తే ఆడవాళ్ల మీదే నాకు పెద్ద ఆసక్తి లేదు. అంచేత నేను అటువంటి పని చెయ్యటానికి ఆస్కారం లేక పోయిందింతవరకూ. ఒకవేళ ఎవరైనా 'తప్పుపని' చేసినా వాళ్లని నడి వీథిలో నిలబెట్టి అగ్నిసంస్కారం చెయ్యాలనే తత్త్వం కాదు నాది. నా ఆలోచనలూ ఆశయాలూ వేరే స్థాయికి చెందుతాయి.'

'మిమ్మల్ని నేనెప్పుడూ ప్రేమించలేదు' అన్నాను.

'నిన్ను ప్రేమించానని నేనూ అనలేదే. 'ప్రేమ' అని ఈ రోజుల్లో వాడుతూన్న పదానికి అర్థంలేదు. చూడగానే కలిగే భావం ప్రేమ కాదు. పైపై పరిచయాలతో ఏర్పడే స్నేహమూ ప్రేమ కాదు. అది మోహమైనా అవుతుంది. ఆకర్షణ అయినా అవుతుంది. ప్రేమ అనేది రక్తసంబంధం వల్ల కలుగుతుంది. లేదా, సహజీవనంతో పుట్టి పెరుగుతుంది. 'ప్రేమ వివాహం' కానంత మాత్రాన మన తల్లితండ్రులకి ఒకరిపై నొకరికి ఉన్న అనురాగం ప్రేమ కాదనగలవా? వాళ్ల ముప్ఫయ్యేళ్ల కాపురంతో వాళ్లు సాధించినది అదే. ఏదో ఒక ధ్యేయం పెట్టుకుని సహజీవనం చెయ్యటంలో ప్రేమ ఆవిర్భవించి క్రమక్రమంగా విస్తృత మవుతుంది. అల్పవిషయా లలో వచ్చే మనస్పర్ధలకు అప్పుడు విలువ ఉండదు. అటువంటి ప్రేమ అన్ని ఒడుదుడుకులకూ తట్టుకోగలుగుతుంది. తగిన వ్యక్తిని ఎంచుకుని

సహజీవనం ప్రారంభిస్తే ప్రేమ గురించి ప్రత్యేకం ఆలోచించవలసిన అవసరం ఉండదు. 'తగిన' వ్యక్తిని ఎంచుకోవటంలో తొందర పడకూడదు. ఇన్నాళ్ళూ నీకోసం ఆగినందుకు నేను విచారించటం లేదు..'

ఇటువంటి మాటల కోసమే మూర్తిలో వెతికాను. నన్నొక 'వ్యక్తి'గా గుర్తించి నన్ను గౌరవించగల సహచరుని కోసమే మూర్తిలో వెతికాను. ఇంకా అన్వేషణలో ఉండగానే 'ప్రేమ' అనే పొగమంచు నా దృక్పథాన్ని కప్పేసింది. ఆ పొగమంచు వెనుక నా ఆశయం కరిగిపోయినట్లుగా శేఖరం మాటలు నాకు కనువిప్పు కలిగించాయి. నా సాహచర్యాన్ని వాంఛించే వ్యక్తిని స్పష్టంగా గుర్తించాను.

రైలు కూత వినిపించింది. నేను కదల్లేదు. మరొకసారి హెచ్చరించి రైలు కదిలింది. నేను చలించలేదు. రైలు నా ముందునుంచి సాగిపోయింది.

(జ్యోతి- సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు 65)